RNI No. APTEL/2009/28868

# సిటిజన్ టైమ్స్

ప్రజా సమస్యలపై పోరాటమే మా లక్ష్యం

తెలుగు దినపత్రిక

CITIZEN TIMES TELUGU DAILY



VOLUME: 17 ISSUE: 253 EDITOR: KANCHERLA SANDEEP KUMAR VISAKHAPATNAM 8-4-2026 Pages: 8 R2/-
సంపుటి : 17 సంచిక : 253 ఎడిటర్ : కంచర్ల సందీప్ కుమార్ విశాఖపట్నం 8-4-2026 పేజీలు : 8 రు2/-

# ఏపీకి పెట్టుబడుల ప్రవాహం...

## రూ.39,436 కోట్ల ప్రాజెక్టులకు ఎస్ఐపీబీ గ్రీన్ సిగ్నల్

- సౌర విద్యుత్ హబ్‌గా రాయలసీమ
- ఎలక్ట్రానిక్స్ తయారీ రంగంపై ప్రత్యేక దృష్టి
- వ్యవసాయ వ్యర్థాల సద్వినియోగం
- పారిశ్రామిక భద్రతకు పెద్దపీట
- ప్రాజెక్టుల వేగవంతం.. పెట్టుబడుల సమీక్ష



**అమరావతి, సిటిజన్ టైమ్స్**

ఆంధ్రప్రదేశ్‌ను పారిశ్రామిక ప్రగతి పథంలో పరుగులు పెట్టించే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. రాష్ట్రంలో వివిధ రంగాల్లో భారీ పెట్టుబడులకు మార్గం సుగమం చేస్తూ, రూ.39,436.84 కోట్ల విలువైన 31 ప్రాజెక్టులకు రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు (ఎస్ఐపీబీ) ఆమోదముద్ర వేసింది. ఈ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రంలో ప్రత్యక్షంగా 1,11,278 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. మంగళవారం నాడు సచివాల యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన 16వ ఎస్ఐపీబీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సమావేశంలో మంత్రులు నారా లోకేశ్, కె. అచ్చెన్నాయుడు, పి. నారాయణ, కందుల దుర్గేశ్, టీజీ భరత్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్ సహా పలువురు మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**రూ.39,436 కోట్ల పెట్టుబడులకు ఆమోదం**

పరిశ్రమలు, విద్యుత్, ఐటీ, పర్యాటకం, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి కీలక రంగాల్లో ఈ కొత్త పెట్టుబడులు రానున్నాయి. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి దోహదపడే ఈ ప్రాజెక్టులపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యంగా, అమరావతి క్వాంటం వ్యాలీలో మూడు ప్రతిష్ఠాత్మక సంస్థల ఏర్పాటుకు కూడా ఎస్ఐపీబీ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం విశేషం. ఈ నిర్ణయంతో రాజధాని ప్రాంతంలోనూ పారిశ్రామిక కార్యకలాపాలు ఊపందుకోనున్నాయి. రాష్ట్రానికి వస్తున్న పెట్టుబడులు, వాటి ద్వారా లభించే ఉద్యోగాల వివరాలను ఎప్పటికప్పుడు వెబ్‌సైట్‌లో పొందుపరచడం ద్వారా ప్రజలకు పారదర్శకంగా సమాచారం అందించాలని సీఎం అధికారులను ఆదేశించారు.

**సౌర విద్యుత్ హబ్‌గా రాయలసీమ**

పునరుత్పాదక ఇంధన రంగంలో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రగామిగా నిలపాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి కీలక సూచనలు చేశారు. ముఖ్యంగా, రాయలసీమ జిల్లాల్లో సౌర విద్యుత్ ఉత్పత్తికి అపారమైన అవకాశాలు ఉన్నాయని, ఈ ప్రాంతాన్ని 'సోలార్ హబ్'గా తీర్చిదిద్దాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం 325 గిగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తికి అవకాశం ఉందని అధికారులు వివరించగా, ఈ సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సీఎం సూచించారు. ఉత్పత్తి అయిన విద్యుత్‌ను రాష్ట్ర, జాతీయ గ్రిడ్‌లకు అనుసంధానించాలని మంత్రి నారా లోకేశ్ సూచించారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో

తరువాయి 2లో..

# మీ డాష్ కామెంట్‌కు నేను రాష్ కామెంట్ చేయబోను

## పినరయి విజయన్‌కు రేవంత్ రెడ్డి కౌంటర్

### పాత లెక్కలు కాదు... కొత్తవి చూడండి

### పేదరిక నిర్మూలన, అవినీతిపై సూటి ప్రశ్నలు

### మాది 'తెలంగాణ రైజింగ్' విజన్

**హైదరాబాద్, సిటిజన్ టైమ్స్**



తెలంగాణ, కేరళ రాష్ట్రాల మధ్య అభివృద్ధిపై మొదలైన మాటల యుద్ధం మరింత ముదిరింది. కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ చేసిన వ్యాఖ్యలకు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఘాటైన పదజాలంతో, స్పష్టమైన గణాంకాలతో బదులిస్తూ ఒక బహిరంగ లేఖ రాశారు. తాను గౌరవప్రదంగా విమర్శలు చేసినప్పటికీ, విజయన్ మాత్రం అమర్యాదకరమైన భాషను ఉపయోగించారని రేవంత్ ఆక్షేపించారు. "మీ డాష్ కామెంట్‌కు నేను రాష్ కామెంట్ చేయబోను" అంటూ చురక అంటించిన ఆయన, మీరు మా రాష్ట్రానికి వచ్చినప్పుడు అతిథికి ఇవ్వాల్సిన పూర్తి గౌరవం ఇస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు, ఇదే నా చివరి స్పందన అంటూ రేవంత్ రెడ్డి తన లేఖను ఎక్స్ లో పంచుకున్నారు.

**పాత లెక్కలు కాదు... కొత్తవి చూడండి**

తెలంగాణ ప్రస్తుత పనితీరుపై తీర్పు ఇవ్వడానికి పినరయి విజయన్ 2023-24 నాటి నీతి ఆయోగ్ సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సూచీని ఉటంకించడంపై రేవంత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం

తరువాయి 2లో..

# భారత్ ధర్మసత్రం కాదు: అమిత్ షా



**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు సమయం దగ్గర పడుతుండటంతో ఆయా రాష్ట్రాల్లో ప్రచారం జోరుగా సాగుతోంది. తాజాగా అస్సాంలోని బరాక్ లోయలో జరిగిన ఎన్నికల ప్రచారంలో కేంద్రమంత్రి అమిత్ షా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన అక్రమ

తరువాయి 2లో..




## మా సహనం నశించింది: ఇరాన్

**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

ఇరాన్ ఆర్థిక కిరీటమైన ఖర్గ్ ఐలాండ్‌పై మరోసారి దాడులు జరిగాయని స్థానిక మీడియా వెల్లడించింది. హర్మూజ్ జలసంధిని పూర్తిగా తెరిచేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు విధించిన గడువుకు కొన్ని గంటలే మిగిలి ఉన్నవేళ ఖర్గ్‌తో పాటు ఆ దేశంలోని రహదారులు, రైల్వే వంతెనలపై భారీ దాడులు చోటుచేసుకున్నాయి. ద్వీపంలోని మిలిటరీ టార్గెట్లపైనా అమెరికా–ఇజ్రాయెల్ బాంబుల వర్షం కురిపించాయి. మార్చినెలలో కూడా అమెరికా ఓసారి ఈ ప్రాంతంలో దాడులు చేసింది.


**ఏంటీ ద్వీపం..?**

పర్షియన్ గల్ఫ్‌లో ఖర్గ్ ఒక చిన్న ద్వీపం. ఇరాన్ తీరానికి 25-30 కి.మీ దూరంలో ఉండే ఇది.. ఆ దేశ ఆర్థిక వ్యవస్థకు

తరువాయి 2లో..

# బెంగాల్‌పై కన్నేస్తే..

## పాక్‌కు రాజ్‌నాథ్ సింగ్ స్ట్రాంగ్ వార్నింగ్



**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

పాకిస్థాన్‌కు రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. బెంగాల్‌పై కన్నేస్తే ఈసారి పాక్ ఎన్ని ముక్కలవుతుందో ఆ దేవుడికే తెలియాలంటూ హెచ్చరికలు చేశారు. భవిష్యత్తులో భారత్ ఏమైనా దాడులకు పాల్పడితే.. కోల్‌కతానూ లక్ష్యంగా చేసుకుంటామని పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ ఇటీవల కవ్వింపులకు పాల్పడ్డారు. ఈ వ్యాఖ్యల పైనే తాజాగా రాజ్‌నాథ్ ఘాటుగా

తరువాయి 2లో..




# ఏబీఎన్ ఆంధ్రజ్యోతి కార్యాలయంపై వైసీపీ దాడిని ఖండించిన పవన్, నారా లోకేశ్

**హైదరాబాద్, సిటిజన్ టైమ్స్**

హైదరాబాద్‌లోని ఏబీఎన్ ఆంధ్రజ్యోతి కార్యాలయంపై వైసీపీ శ్రేణులు జరిపిన దాడి యత్నం తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర రాజకీయ దుమారం రేపుతోంది. 'వీకెండ్ కామెంట్ బై ఆర్కే' కథనంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ వైసీపీ నేతలు, కార్యకర్తలు ఆందోళనకు దిగారు. ఈ చర్యను ఏపీ ప్రభుత్వం, కూటమి నేతలు తీవ్రస్థాయిలో ఖండించారు. వైసీపీ దాడులపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పందిస్తూ... ఏబీఎన్ ఎండీ వేమూరి రాధాకృష్ణ చేసిన విశ్లేషణను జీర్ణించుకోలేక దాడులకు దిగడం అప్రజాస్వామికమని

తరువాయి 2లో..

# ఆర్మీ చేతికి కాముకాజి ఆయుధం.. రూ.10 కోట్లకే వందల ఆత్మాహుతి డ్రోన్లు



**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

భారత సైన్యం అమ్ములపొదిలో మరో అధునాతన ఆయుధం చేరింది. ఆధునిక సాంకేతిక యుద్ధాల్లో కీలక పాత్ర పోషించే ఆత్మాహుతి డ్రోన్లు (కాముకాజి) ఆర్మీ చేతికి వచ్చినట్లు

తరువాయి 2లో..




## కల్పక్కం రియాక్టర్ క్రిటికాలిటీ!

**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

భారత అణుశక్తి రంగంలో సరికొత్త అధ్యాయం మొదలైంది. తమిళనాడులోని కల్పక్కంలో నిర్మించిన ప్రోటోటైప్ ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్ (పీఎఫ్ బీఆర్) తొలిసారిగా 'క్రిటికాలిటీ'ని విజయవంతంగా సాధించింది. దీంతో మన దేశం అణు విద్యుత్ కార్యక్రమంలో అత్యంత కీలకమైన రెండో దశలోకి అధికారికంగా ప్రవేశించింది. ఒక

తరువాయి 2లో..

## ఎడిటోరియల్

# అమరావతి విషయంలో కేంద్ర పెద్దల మౌన వ్యూహం?

ఏపీలో పుష్కర కాలం గడచినా రాజధాని విషయంలో ఒక కొలిక్కి రాని దుస్థితి ఉంది. అమరావతి పేరుతో భారీ స్కేల్ మీద రాజధానిని నిర్మించాలని టీడీపీ ఆరాటపడుతోంది. అది తప్పు కాదు కానీ నిధులు ఎక్కడ నుంచి వస్తాయన్న చర్చ బుద్ధి జీవుల నుంచి మేధావులలో ఉంది. ఇక వేలాది ఎకరాలను భూ సేకరణ పేరుతో తీసుకున్నారు మౌలిక సదుపాయాలను కల్పించాల్సి ఉంది. అమరావతి రాజధాని విషయంలో టీడీపీ పట్టుదలగా ఉంటే మిత్రులతో పాటు ఏపీలో అన్ని రాజకీయ పార్టీలు టీడీపీకి మద్దతుగా ఉండడం మంచి పరిణామంగానే చూడాలి. ఇక వైసీపీ వ్యతిరేకత రాజకీయాల్లో భాగంగానే అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. ఇక ఏపీలోని కూటమి ప్రభుత్వంలో బీజేపీ ఉంది. అలాగే కేంద్రంలో బీజేపీ ప్రభుత్వంలో టీడీపీ ఉంది. అక్కడా ఎన్డీయే ప్రభుత్వం ఉంది ఏపీలో ఎన్డీయే ఉంది. కానీ అమరావతి రాజధాని విషయంలో బీజేపీ పెద్దల పాత్ర ఏమిటి కేంద్ర ప్రభుత్వాన్ని నడుపుతున్న వారుగా అమరావతికి ఏ విధంగా వారు సాయం భరోసా ఇవ్వాలనుకుంటున్నారు అన్నది అంతా ఆసక్తిగా చూస్తున్నారు అమరావతికి చట్టబద్ధత అంటూ గత కొన్ని రోజులుగా మొదలైన చర్చ చివరికి రాష్ట్రపతి గెజిట్ నోటిఫికేషన్ తో ఒక కొలిక్కి వచ్చింది. గెజిట్ నోటిఫికేషన్ అయితే వచ్చేసింది. ఏపీకి అమరావతి రాజధాని అని భారత దేశంలోని మ్యాపులో చూపిస్తారు. ఇక ఉత్తర ప్రత్యుత్తరాలు అన్నీ అమరావతి అడ్రస్ మీద సాగుతాయి. అమరావతికి ఒక పిన్ కోడ్ ఇస్తారు అంతా బాగానే ఉంది కానీ అమరావతికి కావాల్సింది ఇంతకంటే చాలా ఎక్కువ అన్నది కేంద్రానికి తెలియదా అన్నదే అందరూ చర్చిస్తున్న విషయం. ఎంత కాదనుకున్నా అమరావతి తొలి దశ పనులకు కచ్చితంగా అరవై నుంచి డెబ్బై వేల కోట్ల రూపాయలు అవసరం అవుతాయి. ప్రపంచ బ్యాంక్ ఆసియన్ బ్యాంకుల నుంచి రుణాలను ఇప్పించామని బీజేపీ పెద్దలు చెప్పుకోవచ్చు కానీ అమరావతికి కావాల్సింది గ్రాంట్ ఇన్ ఎయిడ్ అని అంతా అంటున్నారు. అలా ఉదారంగా సాయం దక్కాలి. అంతే కాదు అది తిరిగి అప్పుగా కాకుండా ఏపీ కోసం ఇచ్చేట్లుగా ఉండాలి. అది జరిగితేనే అమరావతి ఊపిరి పీల్చుకుంటుంది కానీ ఆ రకమైన భరోసా కానీ కీలక ప్రకటన కానీ కేంద్ర పెద్దల నుంచి అలాగే జాతీయ స్థాయి నేతల నుంచి రావడం లేదని అంటున్నారు. విభజన చట్టంలో కచ్చితంగా చెప్పారు ఏపీ రాజధానిని కేంద్రం నిధులతో నిర్మించాలని. కానీ వాస్తవంగా అలా జరగడం లేదు, అంతే కాదు కేంద్రం నుంచి గ్రాంటులు కూడా లభించడం లేదు, మరి ఏపీ అప్పులతో ఉందని తెలిసి కూడా ఇంత పెద్ద ఆర్థిక భారం పడుతున్నా ఉపేక్షించి ఊరుకోవడాన్ని ఏ విధంగా అర్థం చేసుకోవాలన్నదే మేధావుల నుంచి వస్తున్న ప్రశ్న. ఒక వైపు ఏపీ ప్రజలు తన సెంటిమెంట్ గా రాజధానిని చూస్తున్నారు. ఇప్పటికి పుష్కర కాలం క్రితం భూములు ఇచ్చిన రైతులు తమకు మేలు జరుగుతుందని ఎదురుచూస్తున్నారు. అమరావతి అంటే రైతు కూలీలు ఉన్నారు చిన్న వ్యాపారులు ఉన్నారు. రోజు వారీ కూలీలు ఉన్నారు, బీదా బిక్కీ ఉన్నారు, వీరందరి కోసం తొందరగా అమరావతి రాజధాని రూపకల్పన జరగాల్సి ఉంది. మరి దేనికైనా నిధుల సమస్యనే ప్రధానంగా ఉంది. కానీ కేంద్రం నుంచి అయితే పెద్దగా రియాక్షన్ రావడం లేదని అంటున్నారు. ఇది మౌనమా లేక మౌనం వెనక వ్యూహమా అన్నది అయితే అర్థం కావడం లేదని అంటున్నారు.

# ఏబీఎన్ ఆంధ్రజ్యోతి కార్యాలయంపై వైసీపీ దాడిని ఖండించిన పవన్, నారా లోకేశ్

మండిపడ్డారు. ఒకవేళ కథనాల్లోని అంశాలు నచ్చకపోతే ప్రజాస్వామ్యబద్ధంగా సమాధానం చెప్పాలి తప్ప, ఇలా భౌతిక దాడులకు దిగడం సరైన పద్ధతి కాదని హితవు పలికారు. గతంలో టీడీపీ కార్యాలయాలపై జరిగిన దాడులను కూడా ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. మంత్రి నారా లోకేశ్ స్పందిస్తూ... జగన్ కళ్లలో ఆనందం కోసం వైసీపీ రౌడీ మూకలు ఇలాంటి దాడులకు తెగబడటం ఆ పార్టీ విష సంస్కృతికి నిదర్శనమని ధ్వజమెత్తారు. గతంలో వైసీపీ హయాంలో బుల్డోజర్లు పంపించినా ఏబీఎన్ రాధాకృష్ణ వెనక్కి తగ్గలేదని... ఇప్పుడు మీ బెదిరింపులకు ఆయన భయపడరని అన్నారు. మీడియా ప్రశ్నిస్తే సమాధానం చెప్పాలి లేదా ఆధారాలతో ఖండించాలని హితవు పలికారు. ప్రజలు ఛీకొట్టినా జగన్ మారడం లేదని విమర్శించారు.

# అణుశక్తిలో భారత్ చారిత్రాత్మక ఘనత..

అణు రియాక్టరులో అణు విచ్ఛిత్తి ప్రక్రియ తనకు తానుగా, స్థిరంగా కొనసాగే అత్యంత కచ్చితమైన స్థితిని 'క్రిటికాలిటీ' అంటారు. అంటే, రియాక్టరులో జరిగే ప్రతి అణు విచ్ఛిత్తి ఘటన, తదుపరి విచ్ఛిత్తిని ప్రేరేపించడానికి అవసరమైన న్యూట్రాన్లను స్థిరమైన వేగంతో ఉత్పత్తి చేస్తుందని అర్థం. అంటే, 500 మెగావాట్ల సామర్థ్యం గల ఈ రియాక్టర్ ఇక విద్యుత్ ఉత్పత్తికి సిద్ధంగా ఉందని అర్థం. ఈ చారిత్రాత్మక విజయంపై ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఇది భారత అణు ప్రయాణంలో ఒక నిర్ణయాత్మక అడుగని, మన శాస్త్రవేత్తలు, ఇంజనీర్ల నైపుణ్యానికి నిదర్శనమని ఆయన ఎక్స్ (ట్విట్టర్) వేదికగా కొనియాడారు. ఈ ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్ ప్రత్యేకత ఏమిటంటే, ఇది ఇంధనాన్ని వినియోగించుకోవడమే కాకుండా, వాడిన దానికంటే ఎక్కువ ఇంధనాన్ని (ప్లుటోనియం) ఉత్పత్తి చేస్తుంది. పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో ప్రభుత్వ రంగ సంస్థ 'భవిని' దీనిని నిర్మించింది. వాణిజ్య స్థాయిలో రష్యా తర్వాత ఇలాంటి రియాక్టర్‌ను నిర్వహిస్తున్న ఘనత సాధించిన రెండో దేశంగా భారత్ నిలిచింది. భారత్ వద్ద యురేనియం నిల్వలు తక్కువగా, థోరియం నిల్వలు అపారంగా ఉన్నాయి. భవిష్యత్తులో ఈ థోరియం నిల్వలను వినియోగించుకుని విద్యుత్ ఉత్పత్తి చేసే మూడో దశకు ఈ రియాక్టర్ ఒక వారధిగా పనిచేస్తుంది. 2026 సెప్టెంబర్ నాటికి పూర్తిస్థాయి వాణిజ్య విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 2070 నాటికి 'నెట్ జీరో' లక్ష్యాన్ని చేరుకోవడంలో ఈ ముందడుగు కీలక పాత్ర పోషించనుంది.

# మీ డాష్ కామెంట్‌కు నేను రాష్ కామెంట్ చేయబోను

చేశారు. ఆ సూచీ పదేళ్ల బీఆర్ఎస్-బీజేపీ పాలన చివరి రోజులను ప్రతిబింబిస్తుందని, 28 నెలల క్రితం 2023 డిసెంబరులో ఆ పాలన ముగిసిందని గుర్తుచేశారు. తమ ప్రభుత్వ పనితీరును కొత్త గణాంకాలతో అంచనా వేయాలని ఆయన సవాలు విసిరారు. “2024-25 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ జీఎస్‌డీపీ రూ. 16.12 లక్షల కోట్లకు చేరింది. జాతీయ సగటు 9.9 శాతం ఉండగా, తెలంగాణ వృద్ధి రేటు 10.1 శాతంగా నమోదైంది. ఆర్బీఐ స్టాటిస్టిక్స్ 2024-25 నివేదిక ప్రకారం, రాష్ట్ర తలసరి ఆదాయం రూ. 3.87 లక్షలకు పెరిగింది. ఈ విషయంలో కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, చివరకు కేరళను కూడా అధిగమించి దేశంలోనే తెలంగాణ అగ్రస్థానంలో నిలిచింది” అని రేవంత్ రెడ్డి తన లేఖలో స్పష్టంగా వివరించారు. కేరళ సాధించిన విజయాలు కొన్ని దశాబ్దాల కృషి ఫలితమని అంగీకరిస్తూనే, ప్రత్యేకంగా విజయన్ హయాంలో ఏం జరిగిందో అక్కడి ప్రజలకు వివరించాలని హితవు పలికారు.

**పేదరిక నిర్మూలన, అవినీతిపై సూటి ప్రశ్నలు**

2025 చివరి నాటికి కేరళ తీవ్ర పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించిన తొలి రాష్ట్రంగా అవతరిస్తుందని విజయన్ చేసిన ప్రకటనను రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. “ఇప్పుడు ఏప్రిల్ 2026 నడుస్తోంది. ఇంకా 64,006 కుటుంబాలకు మైక్రో-ప్లాన్‌లు అందుతున్నాయని మీరే లేఖలో చెబుతున్నారు. మరి తీవ్ర పేదరికం నిజంగా నిర్మూలించబడిందా? నవంబర్ 1, 2025 నాటి మీ ప్రకటనను ఏదైనా స్వతంత్ర సంస్థ ధృవీకరించిందా?” అని నిలదీశారు. నీతి ఆయోగ్ అవినీతి ర్యాంకింగ్స్‌ను తాను గౌరవిస్తానని, కానీ కేరళ నిజంగానే అవినీతి రహిత రాష్ట్రమైతే ముఖ్యమంత్రి కార్యాలయంతో సంబంధాలున్నాయని ఆరోపణలు ఎదుర్కొంటున్న గోల్డ్ స్మగ్లింగ్ కేసు ఎందుకు పరిష్కారం కాలేదని ప్రశ్నించారు. అలాగే, శబరిమల అయ్యప్ప ఆలయం నుంచి మాయమైనట్లు ఆరోపణలున్న 4.5 కిలోల బంగారం లెక్క తేలలేదని గుర్తుచేశారు.

**మాది 'తెలంగాణ రైజింగ్' విజన్**

తమ ప్రభుత్వ దార్శనికతను వివరిస్తూ.. 'తెలంగాణ రైజింగ్' తమ లక్ష్యమని రేవంత్ పేర్కొన్నారు. దశాబ్దంలో రాష్ట్రాన్ని ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే ధ్యేయమన్నారు. హైదరాబాద్ సమీపంలో 'ఫ్యూచర్ సిటీ', జహీరాబాద్‌లో 'నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్' ఈ లక్ష్య సాధనకు మూలస్తంభాలుగా నిలుస్తాయని తెలిపారు. కేరళలో రాబోయే కొత్త ప్రభుత్వం 'నవ కేరళం' విజన్‌ను అమలు చేస్తుందని తాను విశ్వసిస్తున్నానని, త్వరలోనే అక్కడి ప్రజలు సరైన నిర్ణయం తీసుకుంటారంటూ విజయన్‌కు చురకలు అంటించారు.

# ఏపీకి పెట్టుబడుల ప్రవాహం...

ఉంచుకుని, ఇతర రాష్ట్రాలకు విద్యుత్ సరఫరా చేసేందుకు వీలుగా శక్తిమంతమైన ట్రాన్స్‌మిషన్ లైన్లను ఇప్పటి నుంచే సిద్ధం చేసుకోవాలని చంద్రబాబు స్పష్టం చేశారు.

**ఎలక్ట్రానిక్స్ తయారీ రంగంపై ప్రత్యేక దృష్టి..:** ఎలక్ట్రానిక్స్ రంగంలో, ముఖ్యంగా కన్స్యూమర్ ఉత్పత్తుల తయారీలో ఆంధ్రప్రదేశ్‌ను ఒక కీలక కేంద్రంగా మార్చాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. శ్రీసిటీ, కొప్పర్తి, అనంతపురం వంటి ప్రాంతాలలో ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్ పరిశ్రమల ఏర్పాటుకు పెద్ద ఎత్తున పెట్టుబడులను ఆకర్షించాలని ఆదేశించారు. దీనితో పాటు, రాష్ట్రంలో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల (జీసీసీ) ఏర్పాటుపైనా ప్రత్యేకంగా దృష్టి సారించాలని, ఏపీని జీసీసీలకు కేంద్రంగా మార్చాలని సూచించారు. ఇది రాష్ట్రంలో నైపుణ్యం కలిగిన యువతకు మరిన్ని ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుంది.

**వ్యవసాయ వ్యర్థాల సద్వినియోగం..:** వ్యవసాయాధారిత రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయం, ఉద్యాన, ఆక్వా రంగాల్లో వెలువడుతున్న వ్యర్థాలను సంపదగా మార్చే ప్రాజెక్టులను ప్రోత్సహించాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. పర్యావరణానికి హాని కలగకుండా, కాలుష్య రహితంగా ఇథనాల్ వంటి ఉప ఉత్పత్తులను తయారు చేసే యూనిట్ల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ అంశంపై పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి, అవసరమైతే కేంద్ర ప్రభుత్వ సహకారం కూడా తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఇది రైతులకు అదనపు ఆదాయం కల్పించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుంది.

**పారిశ్రామిక భద్రతకు పెద్దపీట..:** రాష్ట్రంలో ఏర్పాటు కానున్న పరిశ్రమల్లో ఆధునిక, అత్యున్నత భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు తేల్చి చెప్పారు. భవిష్యత్తులో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా ఎదుర్కొనేలా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు ఉండాలన్నారు. ముఖ్యంగా ఫార్మా, స్టీల్, గ్రీన్ ఎనర్జీ వంటి రంగాల్లో ఏర్పాటు చేసే ప్రాజెక్టుల కోసం విపత్తు నిర్వహణ నిబంధనలకు అనుగుణంగా ఒక ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక (రూప్రా) సిద్ధం చేయాలని ఆదేశించారు. ఇటీవల బాణాసంచా తయారీ యూనిట్లలో జరిగిన ప్రమాదాలను ప్రస్తావిస్తూ, భద్రతా ప్రమాణాల విషయంలో ఎలాంటి రాజీ పడరాదని స్పష్టం చేశారు.

**ప్రాజెక్టుల వేగవంతం.. పెట్టుబడుల సమీక్ష..:** ఎస్ఐపీబీ ఆమోదం పొందిన ప్రాజెక్టులు కేవలం కాగితాలకే పరిమితం కాకుండా, నిర్దేశిత గడువులోగా కార్యరూపం దాల్చాలని సీఎం చంద్రబాబు గట్టిగా ఆదేశించారు. ప్రాజెక్టుల గ్రౌండింగ్ ప్రక్రియను వేగవంతం చేసే బాధ్యతను సంబంధిత శాఖలు తీసుకోవాలన్నారు. భారీ ప్రాజెక్టుల పురోగతిని ప్రతి ఎస్ఐపీబీ సమావేశంలోనూ సమీక్షిస్తామని స్పష్టం చేశారు. గత 22 నెలల్లో ఎస్ఐపీబీ ద్వారా రూ.9.36 లక్షల కోట్ల విలువైన 264 ప్రాజెక్టులకు ఆమోదం లభించిందని, వీటి ద్వారా 9.60 లక్షల ఉద్యోగాలు రానున్నాయని అధికారులు తెలిపారు. విశాఖ భాగస్వామ్య సదస్సు ఒప్పందాలను కూడా కలుపుకుంటే రాష్ట్రానికి మొత్తం రూ.20.74 లక్షల కోట్ల పెట్టుబడులు, 23.55 లక్షల ఉద్యోగాలు రానున్నాయని వెల్లడించారు.

**ఎస్ఐపీబీ ఆమోదం పొందిన పెట్టుబడుల వివరాలు:**

**విద్యుత్ రంగం (8 ప్రాజెక్టులు): మొత్తం పెట్టుబడి రూ.12,552 కోట్లు, ఉద్యోగాలు 69,070.**

1. క్లీన్ రెన్యువబుల్ ఎనర్జీ హైబ్రిడ్ సిక్స్ ప్రైవేట్ లిమిటెడ్: కడప, అనంతపురం జిల్లాల్లో రూ.1,391 కోట్ల పెట్టుబడితో 190 ఉద్యోగాలు.
2. క్లీన్ రెన్యువబుల్ ఎనర్జీ హైబ్రిడ్ సిక్స్ ప్రైవేట్ లిమిటెడ్: కడప జిల్లాలో రూ.1,391 కోట్ల పెట్టుబడితో 190 ఉద్యోగాలు.
3. ఎస్సార్ రెన్యువబుల్స్ సోలార్ టు లిమిటెడ్: కర్నూలు జిల్లాలో రూ.1,327 కోట్ల పెట్టుబడితో 1,035 ఉద్యోగాలు.
4. ఎస్సార్ రెన్యువబుల్స్ హైబ్రిడ్ వన్ లిమిటెడ్: కర్నూలు జిల్లాలో రూ.2,714 కోట్ల పెట్టుబడితో 1,240 ఉద్యోగాలు.
5. ఎస్సార్ రెన్యువబుల్స్ హైబ్రిడ్ వన్ లిమిటెడ్: అనంతపురం జిల్లాలో రూ.1,714 కోట్ల పెట్టుబడితో 220 ఉద్యోగాలు.
6. పేస్ డిజిటెక్ ప్రైవేట్ లిమిటెడ్: కడప జిల్లాలో రూ.745 కోట్ల పెట్టుబడితో 345 ఉద్యోగాలు.
7. ఎస్ఏఈఎల్ ఇండస్ట్రీస్ లిమిటెడ్: పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి, కృష్ణా, గుంటూరు, బాపట్ల, ఏలూరు, విజయనగరం జిల్లాల్లో రూ.3,200 కోట్ల పెట్టుబడితో 65,000 ఉద్యోగాలు.
8. హెచ్‌హెచ్‌పీ ఎయిట్ ప్రైవేట్ లిమిటెడ్: తిరుపతి జిల్లాలో రూ.70 కోట్ల పెట్టుబడితో 850 ఉద్యోగాలు.

**ఐటీ, ఎలక్ట్రానిక్స్ (11 ప్రాజెక్టులు): మొత్తం పెట్టుబడి రూ.18,210.36 కోట్లు, ఉద్యోగాలు 36,411.**

9. ఇన్ఫోసిస్ లిమిటెడ్: విశాఖ యండాడలో రూ.750 కోట్లతో 7,000 ఉద్యోగాలు.
10. క్రెడెన్స్ రియాలిటీ: విశాఖ తాళ్లవలసలో రూ.386.88 కోట్లతో 6,500 ఉద్యోగాలు.
11. ఫ్యూజీ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్: విశాఖ కాపులుప్పాడలో రూ.425 కోట్లతో 2,500 ఉద్యోగాలు.
12. శ్రీటెక్ డేటా లిమిటెడ్: విశాఖ కాపులుప్పాడలో రూ.1,800 కోట్ల పెట్టుబడి.
13. పీజీ టెక్నోప్లాస్ట్: తిరుపతి జిల్లా శ్రీసిటీలో రూ.1,305 కోట్లతో 2,910 ఉద్యోగాలు.
14. ఎన్‌పీఎస్‌పీఎల్ స్పెషాలిటీ కెమికల్స్: చిత్తూరు జిల్లా కుప్పంలో రూ.2,550 కోట్లతో 400 ఉద్యోగాలు.
15. ఐస్ప్రౌట్ బిజినెస్ సెంటర్: విశాఖపట్నంలో రూ.626.90 కోట్లతో 12,500 ఉద్యోగాలు.
16. ఆర్‌ఆర్‌పీ ఎలక్ట్రానిక్స్: శ్రీ సత్యసాయి జిల్లాలో రూ.10,239.78 కోట్లతో 3,017 ఉద్యోగాలు.
17. సీ డాక్: అమరావతి క్వాంటం వ్యాలీలో రూ.17 కోట్లతో 12 ఉద్యోగాలు.

## మొదటి పేజీ తరువాయి

# ట్రంప్ డెడ్‌లైన్ వేళ.. ఇరాన్ 'కిరీటం' ఖర్గ్‌పై దాడులు

అత్యంత కీలకం. ఇరాన్ తమ చమురు ఎగుమతుల్లో 90 శాతం ఇక్కడి నుంచే నిర్వహిస్తోంది. 1986 నుంచి ఇక్కడ విదేశీ పెట్టుబడులు పెరగడంతో.. ఇరాన్ ఇంధన ఎగుమతులకు కీలకంగా మారింది. కాగా.. హర్మూజ్ జలసంధిని తెరిపించేలా ఒత్తిడి తెచ్చేందుకు ఖర్గ్‌ను ఓ సాధనంగా వాడాలని ట్రంప్ యంత్రాంగం యోచిస్తోంది. ఆ ద్వీపాన్ని స్వాధీనం చేసుకునేందుకు అగ్రరాజ్యం భారీగా బలగాలను మోహరించింది కూడా. అమెరికా భూతలదాడులకు దిగొచ్చన్న అంచనాలున్నాయి. వాటిని తిప్పికొట్టేందుకు ఇరాన్ సిద్ధమవుతోంది.

**మా సహనం నశించింది: ఇరాన్**

తాజా దాడుల నేపథ్యంలో ఇజ్రాయెల్-అమెరికాకు ఇరాన్ (×తీుఅ) హెచ్చరికలు చేసింది. ఇన్నాళ్లు యుద్ధం ముగింపు గురించి ఓపికతో ఎదురు చూశామని..ఇక తమ సహనం నశించిందని ఐఆర్‌జీసీ పేర్కొంది. అమెరికా, ఇజ్రాయెల్ సహా వాటి మిత్ర దేశాలపై దాడులు చేస్తామని వెల్లడించింది. ఆయా దేశాలలోని మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకుంటామని..చమురు, గ్యాస్ సరఫరాలకు ఏళ్ల తరబడి అంతరాయం కలిగిస్తామని హెచ్చరించింది.

# భారత్ ధర్మసత్రం కాదు: అమిత్ షా

చొరబాటుదారుల ప్రస్తావన తీసుకొచ్చారు. పశ్చిమ బెంగాల్‌లో అభివృద్ధి జరగాలన్నా, అక్రమ చొరబాటుదారులను తరిమికొట్టాలన్నా అది భాజపా వల్లే సాధ్యం అవుతుందని పేర్కొన్నారు. భాజపా అధికారంలోకి వస్తేనే ఇవన్నీ జరుగుతాయన్నారు. బరాక్ లోయలో బెంగాలీలు ఎక్కువగా ఉంటారు. దీంతో ఆయన బెంగాల్‌లో అక్రమచొరబాటుదారుల అంశాన్ని పేర్కొనడం గమనార్హం. “పౌరసత్వ సవరణ చట్టం ప్రకారం గూఢచర్యం చేసే వ్యక్తులకు దేశంలో స్థానం లేదని తెలిసే ఆ చట్టాన్ని కాంగ్రెస్ వ్యతిరేకిస్తోంది. రెడ్ కార్పెట్ వేసి మరీ అక్రమ చొరబాటుదారులకు ప్రవేశం కల్పిస్తోంది. భారత్ ధర్మసత్రం కాదు. అక్రమ చొరబాటుదారులకు ఇక్కడ స్థానం లేదు. ఒక్కసారి భాజపా అధికారంలోకి రాగానే రాష్ట్రంలో మార్పు మొదలవుతుంది. బెంగాల్‌లో ఉన్న చొరబాటుదారులను తిరిగి వారి దేశాలకు వెళ్లగొడతాం” అని అమిత్ షా పేర్కొన్నారు. “కాంగ్రెస్ నేతలకు అసలు ప్రజల కష్టాలు తెలుసుకోవాలనే ఉద్దేశం ఉండదు. నిరసనకారులను మెచ్చుకుంటూ రాహుల్ గాంధీ వ్యాఖ్యలు చేశారు. దీంతో ఆ పార్టీ ఏ స్థాయిలో ఉందో తెలుసుకోవచ్చు” అని పేర్కొన్నారు.

# బెంగాల్‌పై కన్నేస్తే..

## పాక్‌కు రాజ్‌నాథ్ సింగ్ స్ట్రాంగ్ వార్నింగ్

స్పందించారు. ఓ వార్తా సంస్థతో ఆయన మాట్లాడుతూ.. ఇలాంటి రెచ్చగొట్టే వ్యాఖ్యల వల్లనే 55 ఏళ్ల క్రితం పాక్ రెండుగా విడిపోయిన విషయాన్ని గుర్తుచేశారు. 1971లో జరిగిన యుద్ధంలో పాకిస్థాన్ నుంచి విడిపోయి బంగ్లాదేశ్ స్వతంత్రదేశంగా ఏర్పడింది. నాడు బంగ్లా విముక్తి పోరాటానికి భారత సైన్యం అండగా నిలిచింది. ఉద్రిక్తతలను పెంచే ప్రకటనలు చేయవద్దని ఇస్లామాబాద్‌ను ఆయన హెచ్చరించారు. వారు బెంగాల్‌పై కన్నేస్తే.. ఈసారి పాక్ ఎన్ని ముక్కలవుతుందో ఆ దేవుడికే తెలియాలి అని వ్యాఖ్యానించారు.

## ఆర్మీ చేతికి కామికాజి ఆయుధం..

# రూ.10 కోట్లకే వందల ఆత్మాహుతి డ్రోన్లు

తెలుస్తోంది. ఈ రకానికి చెందిన వందలాది డ్రోన్లను స్వదేశీ సంస్థ తాజాగా సైన్యానికి అప్పగించినట్లు సమాచారం. ఈ మేరకు రక్షణశాఖ వర్గాలను ఉటంకిస్తూ పలు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి. రూ.10 కోట్ల ఒప్పందంలో భాగంగా వీటిని అందజేసినట్లు తెలిసింది. గతేడాది ఏప్రిల్‌లో జరిగిన పహల్గాం ఘటన నేపథ్యంలో.. సరిహద్దుల రక్షణ విషయంలో భారత్ మరింత అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. సాంకేతికతను అందిపుచ్చుకుంటూనే ప్రాణనష్టం జరగకుండా.. శత్రు మూకల్ని అంతం చేసేందుకు వీలుగా ఆత్మాహుతి డ్రోన్లను (ూబఱఅఎఱఅవ ణతీశీఅవం) సమకూర్చుకుంటోంది. ఈ క్రమంలోనే గతేడాది డిసెంబరులో కేంద్ర రక్షణశాఖ పలు సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుంది. ఇందులోభాగంగానే తాజాగా గుజరాత్‌లోని సూరత్‌కు చెందిన 'ఇన్‌సైడ్ ఎఫ్‌పీవీ' అనే సంస్థ వందలాది ఆత్మాహుతి డ్రోన్లను ఆర్మీ నార్తర్న్ కమాండ్‌కు డెలివరీ చేసినట్లు సమాచారం. అయితే, భద్రతా కారణాల రీత్యా ఎన్ని డ్రోన్లను అప్పగించారన్న దానిపై కచ్చితమైన సమాచారం బయటకు రాలేదు. కేవలం రెండు నెలల్లోనే ఈ డ్రోన్లను డెలివరీ చేయడం విశేషం. అత్యవసర కొనుగోలు కింద సైన్యం వీటిని తీసుకున్నట్లు తెలుస్తోంది.

**ఏంటీ ఆత్మాహుతి డ్రోన్ల ప్రత్యేకతలు..?**

ఇవి గంటకు 120 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తాయి. ఏఐ ఆధారిత గైడెన్స్‌తో కచ్చితమైన దాడులతో లక్ష్యాలను ఛేదిస్తాయి. గరిష్ఠంగా 2.5 కిలోమీటర్ల ఎత్తు వరకు ఎగరగలవు. 10 కిలోమీటర్ల పరిధిలోని లక్ష్యాలపై దాడులు చేస్తాయి. 2.5 కిలోల వరకు పేలుడు పదార్థాలను ఈ డ్రోన్లు మోసుకెళ్లగలవు. అత్యవసర ముప్పులను వేగంగా ఎదుర్కొనే సామర్థ్యం వీటి సొంతం. శత్రు భూభాగాల్లోకి చొచ్చుకెళ్లి లక్ష్యాలను ఛేదిస్తాయి. సాధారణ దళాలు వెళ్లలేని ప్రాంతాల్లోకి వెళ్లి దాడులు చేయగలవు. జీపీఎస్ అందుబాటులో లేని ప్రాంతాల్లోనూ ఉపయోగించేలా వీటిని రూపొందించారు. కఠినమైన వాతావరణ పరిస్థితులను తట్టుకోగలవు. మైనస్ 35 డిగ్రీల ఉష్ణోగ్రతలోనూ ఈ డ్రోన్లు పనిచేయగలవు.

# కార్మికుల పోరాటాన్ని అవమానించిన వీర్రాజు

## సిపిఎం ఆగ్రహం




**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్**

విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ ఉద్యమంపై బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు చేసిన వ్యాఖ్యలను సిపిఎం తీవ్రంగా ఖండించింది. మంగళవారం ఏచూరి భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె. లోకనాథం మాట్లాడుతూ, కార్మికులు, కమ్యూనిస్టులపై చేసిన వ్యాఖ్యలు అనుచితమని, ఉద్యమాన్ని అవమానించే విధంగా ఉన్నాయని విమర్శించారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆగిపోయిందని చెబుతున్నట్లయితే, ప్రధాని ద్వారా అధికారిక ప్రకటన చేయించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్లాంట్‌లో కార్మికుల తొలగింపులు ఎందుకు కొనసాగుతున్నాయి? ఆధునీకరణకు నిధులు ఎందుకు కేటాయించడం లేదని ప్రశ్నించారు. ప్రైవేట్ సంస్థలకు గనులు కేటాయిస్తూనే, విశాఖ స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు ఇవ్వకపోవడంపై కూడా అభ్యంతరం వ్యక్తం చేశారు.సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం. జగ్గునాయుడు మాట్లాడుతూ, స్టీల్ ప్లాంట్ పరిరక్షణ, సొంత గనుల కేటాయింపు వంటి కీలక అంశాలపై బీజేపీ నేతలు స్పష్టత ఇవ్వాలని అన్నారు. ప్రైవేటీకరణ నిలిపివేస్తున్నట్లు అధికారిక ప్రకటన చేస్తేనే ప్రజలు నమ్ముతారని చెప్పారు. స్టీల్ ఉద్యమంపై అవమానకర వ్యాఖ్యలు చేసిన సోము వీర్రాజు వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని సిపిఎం డిమాండ్ చేసింది.


# వరల్డ్ హెల్త్ డే సందర్భంగా అవగాహన సమావేశం




**గొలుగొండ, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ :07**

గొలుగొండ పీహెచ్‌ఈ పరిధిలో వరల్డ్ హెల్త్ డే సందర్భంగా ఆశ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. వైద్యశాఖ అధికారి శ్యామ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆరోగ్య సూత్రాలను కచ్చితంగా పాటించాలని సిబ్బందికి సూచించారు. ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ సేవలను మరింత సమర్థవంతంగా అందించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఆశా కార్యకర్తలు పలువురు పాల్గొన్నారు.

## శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి వారిని దర్శించుకున్న విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ,పద్మజ దంపతులు





**సింహాచలం, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ :06**

విశాఖపట్నం ఆధ్యాత్మిక కేంద్రం, ప్రముఖ పుణ్యక్షేత్రమైన సింహగిరిపై కొలువై ఉన్న శ్రీ శ్రీ శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి వారిని మంగళవారం విశాఖ దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్ తన సతీమణితో కలిసి అత్యంత భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యే దంపతులకు దేవస్థానం ఏ ఈ ఓ తిరుమలేశ్వరరావు స్వాగతం పలికారు.అనంతరం ధ్వజస్తంభం వద్ద ఆలయ పర్యవేక్షణ అధికారి వారికి సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి ఆలయ మర్యాదలను అనుసరించి స్వామివారి దర్శనానికి తోడ్కొని వెళ్లారు. ముందుగా ఎమ్మెల్యే దంపతులు సింహాచల క్షేత్రంలోని అత్యంత మహిమాన్వితమైన కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని, తమ మొక్కులను తీర్చుకున్నారు. అనంతరం గర్భాలయంలోని శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామివారి దివ్య రూపం, క్షేత్ర ప్రాశస్త్యం గురించి వివరించారు. దర్శనానంతరం ఆలయ మండపంలో వేద పండితులు నాదస్వర మంగళ వాయిద్యాల మధ్య, వేద మంత్రోచ్ఛారణలతో ఎమ్మెల్యే దంపతులకు 'వేద ఆశీర్వచనం' అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ఏఈవో స్వామివారి శేష వస్త్రంతో ఎమ్మెల్యే దంపతులను ఘనంగా సత్కరించారు. స్వామివారి జ్ఞాపిక (చిత్రపటం) మరియు పవిత్ర ప్రసాదాలను వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జనసేన నేత శ్రీనివాస్ దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

# జిల్లా సంక్షేమ హాస్టళ్లలో 'నెట్ జీరో హెల్తీ క్యాంపస్' కు శ్రీకారం


## - జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్





**అనకాపల్లి, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్:07**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అన్ని ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో 'నెట్ జీరో హెల్తీ క్యాంపస్' అనే వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించిందని, అందులో భాగంగా జిల్లాలోని 20 కస్తూరిబాయి గాంధీ బాలికా విద్యాలయాల్లో కేజీబీవీ ల పైలట్ ప్రాజెక్ట్‌గా ప్రారంభించినట్లు జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ తెలిపారు. మంగళవారం ఉదయం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కేజీబీవీ ప్రిన్సిపాల్స్ మరియు సంబంధిత జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా, హాస్టళ్లలో వ్యర్థాల నిర్వహణను మెరుగుపరచడం మరియు 'జీరో వేస్ట్' లక్ష్యాన్ని సాధించడం కోసం కేజీబీవీ ప్రిన్సిపాల్స్‌ను ఆదేశించామని కలెక్టర్ పేర్కొన్నారు.జరిగిన కొన్ని కార్యక్రమాల్లో కంపోస్ట్ పిట్లు, సోక్ పిట్లు, కిచెన్ గార్డెన్స్ ఏర్పాటు మొదలైనవి ఉన్నాయి. జూన్ 2026 నుండి జూలై 2027 వరకు ఈ పనులు పూర్తి చేసి, క్యాంపస్‌లను 'నెట్ జీరో' స్థాయికి మార్చడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హార్టికల్చర్ శాఖ, జిల్లా అధికారులు మరియు కేజీబీవీ ప్రిన్సిపాల్స్ కీలక పాత్ర పోషిస్తారని కలెక్టర్ వెల్లడించారు. ప్రాజెక్ట్‌లో కిచెన్ వ్యర్థాల నుండి ఎరువును తయారు చేసే డీకంపోజింగ్ యూనిట్లు, చెత్త సేకరణకు 'టూ–బిన్' విధానం, వర్షపు నీటి సంరక్షణ ఆర్ డబ్ల్యు హెచ్ ద్వారా భూగర్భ జలాలను రీచార్జ్ చేయడం, మురుగు నీటి నిర్వహణ కోసం సోక్ పిట్లు ఏర్పాటు చేయడం వంటి అంశాలు సమీక్షించబడ్డాయి. విద్యార్థులకు సురక్షిత ఆర్ ఓ తాగునీరు, పరిశుభ్రమైన వంటశాలలు, మరుగుదొడ్ల సౌకర్యం, సౌరశక్తి వినియోగం మరియు నీటి సంరక్షణను కూడా ఈ ప్రాజెక్ట్‌లో భాగం చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు.సమావేశంలో సమగ్ర శిక్ష జీసీడో , ఎ ఎస్ డి జమీమా, డిహెచ్‌ఓ ఏ. రాజశేఖరమ్, సోషల్ ఫారెస్ట్ డి ఎఫ్ ఓ సోమసుందరన్, కేజీబీవీ ప్రిన్సిపాల్స్, సమగ్ర శిక్ష డే డి ఈ లు సుబ్బలక్ష్మి, గణేష్ ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.




### ప్రజాస్వామ్యం ప్రమాదంలో...

# రాజకీయాలు, లంచగొండి వ్యవస్థ చేతిలో పరిపాలన బందీ!

## ప్రజాస్వామ్యంలో కొత్త చర్చ.. నాయకులకు కనీస విద్య అవసరమా..?

**స్పెషల్ స్టోరీ, సిటిజన్ టైమ్స్ డెస్క్**

ప్రజాస్వామ్యం అంటే ప్రజల ఆశలు నెరవేర్చే వ్యవస్థ. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో అది నిజంగా ఆ దిశగా నడుస్తుందా అనే ప్రశ్న రోజురోజుకీ బలపడుతోంది. రాజకీయాలు కులం, మతం, ప్రాంతం దాటి ఇప్పుడు ప్రభుత్వ యంత్రాంగాన్ని, ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగులను ప్రభావితం చేస్తున్నాయన్న ఆరోపణలు సమాజంలో తీవ్ర చర్చకు దారి తీస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో రాజకీయ నాయకులు తమకు అనుకూలంగా పనిచేసే అధికారులను తమ నియోజకవర్గాలకు బదిలీ చేయించుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నిష్పక్షపాతంగా పనిచేసే అధికారులు పక్కన పడిపోతుండగా, అనుచర భావనతో వ్యవహరించే వారు కీలక స్థానాల్లో కొనసాగుతున్నారన్న అభిప్రాయం పెరుగుతోంది. దీని ఫలితంగా అక్రమాలను అరికట్టాల్సిన వ్యవస్థే కొన్ని చోట్ల అక్రమాలకు అండగా నిలుస్తోందన్న ఆరోపణలు ప్రజల్లో ఆగ్రహాన్ని రేకెత్తిస్తున్నాయి. ముఖ్యంగా కొన్ని ప్రాంతాల్లో నాయకులు తప్పులు చేస్తున్నప్పటికీ, కొందరు లంచగొండి అధికారులు లంచాల మత్తులో మునిగిపోయి అక్రమార్కులకు కొమ్ము కాస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. చట్టాన్ని అమలు చేయాల్సిన వారు మౌనంగా చూస్తే సామాన్య ప్రజలకు న్యాయం ఎక్కడ దొరుకుతుంది అన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. అయితే ఇలాంటి పరిస్థితుల్లో కూడా సమాజం పూర్తిగా చీకటిలో మునిగిపోలేదు. హ్యూమన్ రైట్స్ సంఘాలు, మీడియా ప్రతినిధులు కొంత మేరకు నైతిక విలువలను పాటిస్తూ తప్పు చేసే వారి గుండెలపై తూటాల్లా నిలబడి ప్రశ్నిస్తున్నందువల్లే సమాజంలో కొంతమేర మెరుగుదల కనిపిస్తోంది. వారి జాగ్రత్త దృష్టి లేకపోతే పరిస్థితి మరింత దిగజారిపోయేదన్న అభిప్రాయం విస్తృతంగా వ్యక్తమవుతోంది. ఇలాంటి నేపథ్యంలో ప్రజలు ఒక కీలక డిమాండ్‌ను ముందుకు తెస్తున్నారు. "ఒక ప్రభుత్వ ఉద్యోగం పొందాలంటే డిగ్రీలు, పీజీలు తప్పనిసరిగా ఉంటాయి. అయితే లక్షలాది ప్రజలను నడిపించే నాయకులకు కనీస విద్యా అర్హత ఎందుకు ఉండకూడదు? వారి మీద క్రిమినల్ కేసులు లేకపోవడం కూడా తప్పనిసరి చేయాలి" అని గట్టిగా కోరుతున్నారు. ప్రజల అభిప్రాయం ప్రకారం, ఒక కుటుంబంలో యజమాని సక్రమంగా లేకపోతే ఆ కుటుంబం కూలిపోతుంది. అదే విధంగా లక్షల జనాభా ఉన్న ప్రాంతానికి నాయకుడిగా ఉండే వ్యక్తికి అవగాహన, బాధ్యత లేకపోతే ఆ ప్రాంత అభివృద్ధి ఎలా సాధ్యం అవుతుంది? ప్రజల సమస్యలు ఎలా పరిష్కారం అవుతాయి? అన్న ప్రశ్నలు సహజంగానే వస్తున్నాయి. ఇంకా ప్రజల్లో వినిపిస్తున్న మరో ముఖ్యమైన భావన ఏమిటంటే ప్రభుత్వాలు ప్రజలను "ఉద్ధరించాల్సిన అవసరం లేదు" కానీ విద్య, వైద్యం, ప్రాథమిక సేవలు సకాలంలో అందిస్తే అదే ఉత్తమ పరిపాలన అని భావిస్తున్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు సమర్థవంతంగా అందితేనే ప్రభుత్వం తన బాధ్యతను నెరవేర్చినట్టవుతుంది అన్న అభిప్రాయం బలపడుతోంది. ప్రస్తుత పరిస్థితుల్లో రాజకీయ ఒత్తిడులు పెరిగి, అధికార వ్యవస్థ స్వతంత్రత కోల్పోతే నిష్పక్షపాత పరిపాలన దెబ్బతింటుంది. బదిలీల భయంతో అధికారులు స్వేచ్ఛగా పనిచేయలేరు. నిర్ణయాలు ఆలస్యమవుతాయి. చివరకు నష్టపోయేది సామాన్య ప్రజలే, న్యాయం ఆలస్యమవుతుంది, సేవల నాణ్యత తగ్గుతుంది, అవినీతి పెరుగుతుంది.ఈ పరిస్థితిని మార్చాలంటే కేవలం ప్రభుత్వ మార్పు సరిపోదు వ్యవస్థలో సమూల మార్పు అవసరం. బదిలీలు, పోస్టింగుల్లో పారదర్శక విధానం, రాజకీయ జోక్యంపై కఠిన నియంత్రణ, లంచగొండి అధికారులపై నిర్దాక్షిణ్య చర్యలు తప్పనిసరి. అదే విధంగా ప్రజాప్రతినిధులకు కనీస విద్యా అర్హతలు, నేర కేసుల విషయంలో కఠిన నిబంధనలు అమలు చేయాలన్న డిమాండ్‌ను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రజాస్వామ్యం బలపడాలంటే ప్రజల నమ్మకం నిలబడాలి. ప్రజల నమ్మకం నిలబడాలంటే... న్యాయం, పారదర్శకత, బాధ్యతాయుత పరిపాలన తప్పనిసరి. లేకపోతే ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తి ఒకరోజు పెద్ద ప్రశ్నగా మారి ప్రభుత్వాలనే నిలదీయాల్సిన పరిస్థితి తలెత్తే ప్రమాదం ఉందన్న హెచ్చరిక స్పష్టంగా వినిపిస్తోంది.

# గొలుగొండలో జల దార

## – జలహారతి" సమావేశం నిర్వహణ



**గొలుగొండ, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్:07**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాడు ఆదేశాల మేరకు గొలుగొండ మండల పరిషత్ కార్యాలయంలో "జల దార జలహారతి" కార్యక్రమం భాగంగా సమావేశం నిర్వహించారు. 2026--27 సంవత్సరానికి సంబంధించి ఎం.జి.ఎన్.ఆర్.ఈ.జి.ఎస్ నిధులతో గ్రామాల్లో ఉన్న చెరువులను అభివృద్ధి చేసి నీరు వృథా కాకుండా చర్యలు చేపట్టేందుకు 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక, బడ్జెట్ అంచనాల తయారీపై చర్చించారు. ఈ సమావేశంలో చోద్యం సర్పంచ్ అదపురెడ్డి గోపి, నీటిసంగం అధ్యక్షులు, రాయపురెడ్డి నాగేశ్వరరావ, గొర్లు సత్యనారాయణ (కో–ఆపరేటివ్ బ్యాంకు అధ్యక్షుడు)చిటికెల సాంబమూర్తి , ఎఈ ఇరిగేషన్, అపో ఎపివో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు. సమావేశాన్ని ఎంపీడీఓ శ్రీనువాసు రావు, ఎపి ఓసుర్యమణి ఆధ్వర్యంలో నిర్వహించారు.

# భారత రాజ్యాంగంలో ఆర్టికల్ 17




భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 17 దేశంలో శతాబ్దాలుగా కొనసాగుతున్న అంటరానితనం అనే సామాజిక దురాచారాన్ని పూర్తిగా రద్దు చేస్తూ, కుల ఆధారిత వివక్షపై గట్టి నిషేధాన్ని విధించింది. ప్రాథమిక హక్కులలో భాగమైన ఈ ప్రకరణ, ప్రతి పౌరుడికి సమానత్వం, గౌరవం మరియు సామాజిక న్యాయం కల్పించడంలో కీలక పాత్ర పోషిస్తోంది. అంటరానితనం అనేది భారత సమాజంలో చాలా కాలంగా కొనసాగిన ఒక అన్యాయపూరిత ఆచారం. కులం ఆధారంగా వ్యక్తులను తక్కువగా చూడడం, వారి హక్కులను నిరాకరించడం వంటి చర్యలు మానవ గౌరవాన్ని దెబ్బతీసేవిగా గుర్తించిన రాజ్యాంగ నిర్మాతలు, ఈ దురాచారాన్ని పూర్తిగా నిర్మూలించడానికి ఆర్టికల్ 17ను చేర్చారు. ఈ ప్రకారం, అంటరానితనాన్ని ఏ రూపంలోనైనా ఆచరించడం, ప్రోత్సహించడం లేదా దాని ఆధారంగా ఇతరులపై ఆంక్షలు విధించడం చట్టరీత్యా శిక్షార్హమైన నేరంగా పరిగణించబడుతుంది. దీని ద్వారా కేవలం నిషేధమే కాకుండా, చట్టపరమైన చర్యల ద్వారా ఈ దురాచారాన్ని అరికట్టే విధంగా బలమైన వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఆర్టికల్ 17 అమలు ద్వారా సమాజంలో కుల వివక్షను తగ్గించడం, సమాన అవకాశాలను అందించడం మరియు ప్రతి ఒక్కరికీ గౌరవప్రదమైన జీవితం కల్పించడం లక్ష్యంగా ఉంది. ఇది సమానత్వ హక్కును బలపరుస్తూ, భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో న్యాయం మరియు సమానత్వం అనే మౌలిక సూత్రాలను మరింత దృఢంగా నిలబెడుతోంది. సామాజికంగా వెనుకబడిన వర్గాల హక్కులను రక్షించడం, వారికి సమాన స్థానం కల్పించడం, సమాజంలో గౌరవం మరియు సమానత్వాన్ని ప్రోత్సహించడం వంటి లక్ష్యాలను సాధించడంలో ఆర్టికల్ 17 ఒక ముఖ్యమైన రాజ్యాంగ ఆయుధంగా నిలుస్తోంది.

**జె. కనక దుర్గ లక్ష్మీ**
**ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ (IHR) ఉత్తరాంధ్ర ఇంచార్జి.**

# డాక్టర్ రామ్‌కుమార్ సేవలు అభినందనీయం..

## నిరాశ్రయులకు ఉచిత వైద్య సేవలు - ప్రారంభించిన విశాఖ సీపీ బాగ్చీ







**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ :07**

11 ఏళ్ల క్రితం లక్ష్మీగాయత్రి పేరిట ఆసుపత్రి ప్రారంభించి, ఇప్పటి వరకు 600కి పైగా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించిన డాక్టర్ కాంద్రేగుల వెంకట రామ్‌కుమార్ సేవలు విశాఖ సిటీ పోలీసులు, ముఖ్యంగా పోలీస్ కమిషనర్ డాక్టర్ శంకబ్రత బగ్చీ అభినందనీయమని తెలిపారు. సీపీ బగ్చీ ఈసారి లక్ష్మీగాయత్రి ఆసుపత్రి ఆధ్వర్యంలో మంగళవారం ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని నిరాశ్రయ గృహంలో ఉచిత వైద్య సేవలను ప్రారంభించారు. ప్రతి నెలా పేదలకు వైద్యం, మందులు ఉచితంగా అందించే రామ్‌కుమార్ సేవలను ప్రత్యేకంగా ప్రశంసిస్తూ, పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ, ప్రజల కోసం వైద్య శిబిరాలను నిర్వహించడం గొప్ప ఉదాహరణ అని తెలిపారు. సీపీ బాగ్చీ ఈసారి లక్ష్మీగాయత్రి ఆసుపత్రి ఆధ్వర్యంలో మంగళవారం ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని నిరాశ్రయ గృహంలో ఉచిత వైద్య సేవలను ప్రారంభించారు. ప్రతి నెలా పేదలకు వైద్యం, మందులు ఉచితంగా అందించే రామ్‌కుమార్ సేవలను ప్రత్యేకంగా ప్రశంసిస్తూ, పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ, ప్రజల కోసం వైద్య శిబిరాలను నిర్వహించడం గొప్ప ఉదాహరణ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రామ్‌కుమార్ నిరాశ్రయుల కోసం ప్రతి నెలా 20 బియ్యం బస్తాలు కూడా అందజేస్తానని తెలిపారు. 'ఆపరేషన్ జ్యోతిర్గమయ'లో భాగంగా పోలీసుల ఆధ్వర్యంలో మందులను అందుబాటులో ఉంచడం ద్వారా పేదలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రామ్‌కుమార్ నిరాశ్రయుల కోసం ప్రతి నెలా 20 బియ్యం బస్తాలు కూడా అందజేస్తానని తెలిపారు. 'ఆపరేషన్ జ్యోతిర్గమయ'లో భాగంగా పోలీసుల ఆధ్వర్యంలో మందులను అందుబాటులో ఉంచడం ద్వారా పేదలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో లక్ష్మీగాయత్రి ఆసుపత్రి డాక్టర్స్ రమేష్, ఆనంద్, జనసేన పార్టీ డాక్టర్స్ సెల్ ప్రతినిధి వాకా సునీత, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు. పేద, వృద్ధులు అల్పాహారం తీసుకున్నారు.

# హైవేపై విషాదం..


## లారీ ఢీకొని డ్రైవర్ మృతి



**ఆనందపురం, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ :07**

ఆనందపురం మండల పరిధిలో జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఖంతాల మాడుగుల గ్రామానికి చెందిన అంగుళూరు రాజు (36) మంగళవారం దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, అంగుళూరు రాజు గాజువాకలోని ఫ్లిప్కార్ట్ సంస్థలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం ఉదయం సుమారు 11:50 గంటల సమయంలో ఆనందపురం నుంచి పెందుర్తి వైపు వెళు న్న సమయంలో అతడు నడుపుతున్న వ్యాన్‌కు యాంత్రిక లోపం తలెత్తింది. దీంతో వాహనాన్ని రహదారి పక్కన నిలిపి దాన్ని సరిచేయడానికి ప్రయత్నిస్తుండగా, వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ అతడిని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాజు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఆనందపురం పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని భీమిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి భార్య అంగుళూరు రామలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆనందపురం సీఐ వాసునాయుడు కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై ఎస్సై హరీష్ దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# విద్యార్థుల నమోదు కోసం శాసన సభాపతి చైతన్యం.. ప్రచార కరపత్రాలు విడుదల



**నర్సీపట్నం,సిటిజన్ టైమ్స్, ఏప్రియల్:07**

నర్సీపట్నం శివపురం మోడల్ ప్రైమరీ పాఠశాలలో విద్యార్థుల నమోదు ప్రచార కరపత్రాలను ఆంధ్రప్రదేశ్ శాసన సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు తమ క్యాంపు కార్యాలయంలో పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి విడుదల చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చేరికలను పెంచాలని ఆయన పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం విద్యాశాఖకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ నిధులను కేటాయిస్తున్నదని, మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం అవుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఆర్టీఓ జిల్లా అధ్యక్షుడు గోపీనాథ్, ప్రధానోపాధ్యాయుడు సంభరాజు, ఉపాధ్యాయులు, విద్యా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# వేసవి సెలవుల్లో పిల్లల భద్రతపై అప్రమత్తంగా ఉండాలి: ఎస్పీ తుహిన్ సిన్హా



**అనకాపల్లి జిల్లా, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ :07**

పరీక్షలు ముగిసి వేసవి సెలవులు ప్రారంభమవుతున్న నేపథ్యంలో విద్యార్థులు, చిన్నపిల్లల భద్రతపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, ఐపీఎస్ సూచించారు. సెలవుల్లో సరదా కోసం పిల్లలు ప్రమాదకర ప్రదేశాలకు వెళ్లే అవకాశముందని, ముఖ్యంగా చెరువులు, బావులు, కాలువలు, సముద్ర తీరాలు వంటి జలాశయాల వద్దకు ఒంటరిగా వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన అన్నారు. నీటి లోతు తెలియక లేదా ప్రవాహ వేగానికి లోనై ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని హెచ్చరించారు. పిల్లలు ఇంటి వద్ద ఉన్న సమయంలో వారు ఎక్కడికి వెళ్తున్నారు, ఎవరితో ఉంటున్నారు అనే విషయాలను తల్లిదండ్రులు నిరంతరం గమనించాలని సూచించారు. ముఖ్యంగా మధ్యాహ్న వేళల్లో పిల్లలు బయటకు వెళ్లకుండా ఇళ్లలోనే ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. నీటి ప్రమాదాల వల్ల కలిగే నష్టాలను, గతంలో జరిగిన ఘటనలను పిల్లలకు వివరించి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. సరదా ప్రాణాంతకం కాకూడదని వారికి తెలియజేయాలని సూచించారు. సెలవుల్లో పిల్లలను ఆటపాటలు, పుస్తక పఠనం, వేసవి శిక్షణ శిబిరాలు వంటి సృజనాత్మక కార్యక్రమాల వైపు మళ్లించడం ద్వారా వారి సమయాన్ని సురక్షితంగా, ప్రయోజనకరంగా మార్చవచ్చని పేర్కొన్నారు. సముద్ర తీర ప్రాంతాలకు వెళ్లే పర్యాటకులు, స్థానికులు అలల ఉధృతిని గమనించి, హెచ్చరిక బోర్డులు ఉన్న ప్రదేశాల్లో నీటిలోకి దిగకూడదని సూచించారు. పిల్లల భద్రత తల్లిదండ్రుల బాధ్యత. వేసవి సెలవుల్లో ఏ ఒక్క కుటుంబంలోనూ విషాదం చోటుచేసుకోకూడదనేదే మా లక్ష్యం. జిల్లా పోలీస్ యంత్రాంగం అప్రమత్తంగా ఉంది, ప్రజలు కూడా సహకరించాలి" అని ఎస్పీ తుహిన్ సిన్హా పేర్కొన్నారు. ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో వెంటనే డయల్ 100/112 లేదా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని కోరారు.

# డ్రగ్స్ నియంత్రణలో సీపీ బాగ్చీ ఫోకస్.. సంయుక్త చర్యలు ప్రారంభం






**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ :07**

విశాఖపట్నం నగరంలో డ్రగ్స్ మరియు ఇతర మాదకద్రవ్యాలను పూర్తిగా నిర్మూలించడానికి, నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో అధికారులతో కలిసి నగర పోలీస్ కమిషనర్ డా. శంఖబ్రాత్ బాగ్చి, ఐ.పి.ఎస్. కో-ఆర్డినేషన్ మీటింగ్ నిర్వహించారు. మంగళవారం సాయంత్రం, నగర పోలీస్ కమిషనర్ కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన కో-ఆర్డినేషన్ మీటింగ్‌లో నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో అధికారులు, వారి సిబ్బంది మరియు నగర పోలీస్ అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో సింటటిక్ డ్రగ్స్, సెమీ-సింటటిక్ డ్రగ్స్ కింగ్ పిన్స్ అరెస్టులు, వాటి ప్రధాన మూలాల గుర్తింపు మరియు సంబంధిత వ్యూహాలపై చర్చలు జరిపి, ఉమ్మడిగా కీలక నిర్ణయాలు తీసుకోవడం జరిగింది. కో-ఆర్డినేషన్ మీటింగ్‌లో సిపి తో పాటు ఎన్.సి.బి అధికారులు, నగర డి.సి.పి-01, డి.సి.పి-02, ఏ.డి.సి.పి లు, ఏ.సి.పి లు, సీఐ లు మరియు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# వరల్డ్ హెల్త్ డే సందర్భంగా ఒమేగా హాస్పిటల్స్ క్యాన్సర్ స్క్రీనింగ్ ప్యాకేజీలు




**విశాఖపట్నం,సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ :07**

వరల్డ్ హెల్త్ డే సందర్భంగా ఎన్ఎబీహెచ్ గుర్తింపు పొందిన ఒమేగా హాస్పిటల్స్, విశాఖపట్నం వారు ప్రజల్లో క్యాన్సర్పై అవగాహన పెంపొందించడం కోసం, తొలిదశలోనే క్యాన్సర్ను గుర్తించేందుకు ప్రత్యేక క్యాన్సర్ స్క్రీనింగ్ ప్యాకేజీలను ప్రారంభించినట్లు హాస్పిటల్ యాజమాన్యం ఒమేగా హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బి. రవి శంకర్ మరియు హాస్పటల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ శుభాకర్ రావు తెలియచేసారు. ఈ కార్యక్రమంలో భాగంగా పురుషులు, మహిళల కోసం విడివిడిగా క్యాన్సర్ స్క్రీనింగ్ ప్యాకేజీలను కేవలం రూ.999/-లకు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు, హాస్పిటల్ యాజమాన్యం తెలియచేసారు. ఈ సందర్భంగా ఒమేగా హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బి. రవి శంకర్ మాట్లాడుతూ క్యాన్సర్ ను ప్రారంబ దశ లో గుర్తించ నట్లయితే రోగికి కావలసిన చికిత్సను సమర్ధవంతం గా అధిగమించి వారి జీవన విధానాన్ని తిరిగి యదాస్తితి లోకి తీసుకురావడం చాలా సులభం అవుతుంది. అంతే కాకుండా క్యాన్సర్ను ప్రారంభ దశలోనే గుర్తించడం ద్వారా అనేక రకాల క్యాన్సర్ ల ను పూర్తిగా నయం చేసుకోనే అవకాశం వుంది. అలాంటి అధునాతన సౌకర్యాలు మరియు చికిత్సవిధానాలు ఒమేగా హాస్పిటల్ లో అందుబాటులో వున్నాయని తెలియచేశారు. అనంతరం చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ శుభాకర్ రావు మాట్లాడుతూ చాలా తక్కువ వ్యయంతో అంటే దాదాపు రూ.7000 విలువ గల పరీక్ష లను కేవలం రూ.999 ల కే అందిస్తున్న ఈ చెక్‌అప్ అవకాశాన్ని విశాఖపట్నం, విజయనగరం మరియు శ్రీకాకుళం జిల్లాలకు చెందిన ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. మహిళల ప్యాకేజీలో కంప్లీట్ బ్లడ్ కౌంట్ . సి బి సి .క్రియేటినిస్, లివర్ ఫంక్షన్ టెస్ట్, రాండమ్గ్లూకోజ్,వయస్సును బట్టి డిజిటల్ మమోగ్రఫీ లేదా అల్ట్రాసౌండ్ స్కాన్, పాప్ స్మియర్తో పాటు డాక్టర్, డైటీషియస్ కన్సల్టేషన్లు అంధిస్తారు. పురుషుల ప్యాకేజీలో కంప్లీట్ బ్లడ్ కౌంట్ . సి బి సి, యూరిన్ పరీక్ష, చెస్ట్ ఎక్స్ రే, అబ్డొమెన్ అల్ట్రాసౌండ్ . పి ఎస్ ఏ .పరీక్ష, రీనల్ ఫంక్షన్ టెస్ట్, ఫాస్టింగ్ బ్లడ్ షుగర్ తో పాటు డాక్టర్, డైటీషియస్ కన్సల్టేషన్లు ఉన్నాయి. ఈ ప్రత్యేక ఆఫర్ ఏప్రిల్ 30 వరకు మాత్రమే అందుబాటులో ఉంటుందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని హాస్పిటల్ యాజమాన్యం విజ్ఞప్తి చేసింది.




# రైతుల్లో ల్యాండ్ టైటలింగ్ యాక్టు ప్రకంపనలు

### రూ.700 కోట్ల ప్రచారం ఖర్చుతో రెండు మెడికల్ కాలేజీల నిర్మించవచ్చు

### పాస్ బుక్ ల పంపిణీ కార్యక్రమంలో గంటా విమర్శలు





**ఆనందపురం,సిటిజన్ టైమ్స్,ఏప్రిల్: 07**

క్యూఆర్ కోడ్ స్కానింగ్ తో హద్దులు సహా మొత్తం భూమి వివరాలు తెలిపే పాస్ బుక్ ను రాజముద్రతో ప్రభుత్వం అందిస్తుందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చెప్పారు. ఆనందపురం మండలం మామిడిలోవ పంచాయతీలో మంగళవారం నవీకరించిన పట్టాదార్ పాస్ పుస్తకాలు ఆయన రైతులకు పంపిణీ చేశారు. పొరపాట్లు లేని పాస్ పుస్తకాలను ఆయా భూ యజమానులకు ప్రతి నెల అందిస్తున్నామన్నారు. వైసీపీ హయంలో జగన్మోహన్ రెడ్డి తీసుకువచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేసిందని పేర్కొన్నారు. పట్టాదార్ పాస్ బుక్ లు, సర్వే రాళ్ల పై ఫోటోల కోసం జగన్మోహన్ రెడ్డి రూ. 700 కోట్ల వృధా ఖర్చు చేశారని, ఆ సొమ్ముతో 2 మెడికల్ కాలేజీలు, 10 హైస్కూల్స్ నిర్మించవచ్చని తెలిపారు. వారసత్వంగా వచ్చిన భూమి పత్రాలంటే రైతులకు సెంటిమెంట్ అని, జగన్ వారి భావోద్వేగాలతో పరిహాసమాడారని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టే నాటికి రూ. 10 లక్షల కోట్ల అప్పు ఉందని, ఒకటో తేదీన ఉద్యోగులకు జీతాలు ఇచ్చే పరిస్థితి లేదన్నారు. అనుభవజ్ఞుడైన నాయకుడు ముఖ్యమంత్రిగా ఉండడం వల్ల ఆలస్యం కాకుండా జీతాలివ్వడం సహా రూ. వేల కోట్లతో అభివృద్ధి పనులు చేసుకుంటున్నామని వెల్లడించారు. బోని, ముచ్చర్ల, శిర్లపాలెం తదితర గ్రామాల్లో ఇనాం సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఎమ్మార్వో ఎస్.సూరిబాబు, ఎంపీడీఓ జానకి, జడ్పీటీసీ గాడు వెంకటప్పడు కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, ఘట్టమనేని సుభాష్ చంద్రబోస్, తాత్రాజు అప్పారావు, బి.ఆర్.బి. నాయుడు, గాడు చిన్ని కుమారి లక్ష్మి, బలిరెడ్డి మల్లికార్జునరావు, కంటుభుక్త రామానాయుడు, శాఖారి శ్రీనివాస్, కాకర్లపూడి శ్రీకాంత్ రాజు, లొడగల వెంకట్రావు, కాకర రమణ, కర్రి శ్రీనివాస్, మహంతి శివాజీ తదితరులు పాల్గొన్నారు.

## డాగ్ స్క్వాడ్ చాకచక్యం విశాఖలో 30 కిలోల గంజాయి పట్టివేత



**విశాఖ, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ 07**

నగర పోలీసు కమీషనర్ డా. శంఖబ్రత బాగ్చి, ఐపీఎస్ ఆదేశాలతో సెక్యూరిటీ వింగ్ ఆధ్వర్యంలో జ్ఞానాపురం రైల్వే స్టేషన్ పరిసరాల్లో నిర్వహించిన తనిఖీలలో 30 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. డాగ్ స్క్వాడ్ సహాయంతో నిర్వహించిన తనిఖీలలో 'లైకా' అనే నార్కోటిక్ డాగ్ ఒక సూట్‌కేసులో గంజాయిని గుర్తించింది. సూట్‌కేసును తీసుకువచ్చిన నిందితుడు పరారీలో ఉన్నట్లు గుర్తించి, కేసును కంచరపాలెం పోలీసులకు అప్పగించారు. ఈ సందర్భంగా తనిఖీల్లో పాల్గొన్న డాగ్ స్క్వాడ్ సిబ్బందిని సీపీ అభినందించారు. నగరంలో మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు కొనసాగుతున్నట్లు తెలిపారు.

## జాతీయ రహదారిపై విద్యుత్ లైన్ల తొలగింపు పనులను వేగవంతం చేయాలి - జిల్లా కలెక్టర్



**అమలాపురం, సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 7**

పాసర్లపూడి - దిండి సెక్షన్లలో జాతీయ రహదారిని క్రాస్ చేస్తూ ఉన్న నాలుగు ఏపీ ట్రాన్స్‌కో విద్యుత్ లైన్లను త్వరితగతిన తొలగించేం దుకు ట్రాన్స్‌కో, రెవెన్యూ అధికారులు, జాతీయ రహదా రుల ఇంజనీర్లు ప్రత్యేక చొరవ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో ఏపీ ట్రాన్స్‌కో, జాతీయ రహదా రుల ఇంజనీర్లు, ఆర్డీవోతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన వ ఆర్డీవో సమన్వయంతో జాతీయ రహదారి ఇంజనీర్లు సమావేశమై, లైన్ల క్రాసింగ్ తొలగింపు మరియు కొత్త లైన్ల ఏర్పాటుపై క్షేత్రస్థాయి అధ్యయనం చేయాల న్నారు.కొత్త లైన్ల ఏర్పాటుకు సంబంధించి పరిహారం చెల్లింపుల అంశంపై వన్ టైం సెటిల్మెంట్ పద్ధతిలో చర్చించి, ఈనెల 10వ తేదీ నాటికి తుది నిర్ణయం తీసుకోవాలన్నారు. విద్యుత్ సరఫరాకు పెద్దగా అంతరాయం కలగ కుండా, ప్రత్యామ్నాయంగా కొత్త ట్రాన్స్‌కో లైన్ల ఏర్పాటు పనులను యుద్ధప్రతిపా దికన చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో ఆర్డీవో జి. మమ్మీ, జాతీయ రహదారుల సహాయ ఇంజనీర్ వి.వెంకటర మణ, ఏపీ ఈపీడీసీఎల్ పర్యవేక్షక ఇంజనీర్ బి. రాజేశ్వరి,ఇతర అధికారులు పాల్గొన్నారు.

## నీటి సంరక్షణకు 100 రోజుల ప్రణాళిక




**లింగాపాలెం (సిటిజన్ టైమ్స్) ఏప్రియల్ 07**

ఏలూరు జిల్లా లింగపాలెం మండలంలో లింగపాలెం ఎంపీడీవో కార్యాలయంలో నీటి సంరక్షణ100 రోజుల ప్రణాళిక కు సంబంధించి నీటి వినియోగదార సంఘాల అధ్యక్షులు మరియు ఇరిగేషన్ ,రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖలతో ఏర్పాటు చేసిన సమన్వయ సమావేశంలో మ్మెల్యే రోషన్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వ్యవసాయానికి నీరు ముఖ్యం అని నీటి వినియోగదారుల సంఘాలను చంద్రబాబు ఏర్పాటు చేశారని రోషన్ కుమార్ పేర్కొన్నారు సాగు నీటిసంఘాలు క్రియాశీలకంగా ఉండి పంచాయతీరాజ్, రెవెన్యూ,నీటి పారుదల శాఖ, అటవీశాఖ అధికారులతో సమన్వయం తో అంచనాలు రూపొందించాలని మీూా రోషన్ కుమార్ సూచించారు. సాగు నీటి చెరువుల మరమ్మతుల ద్వారా నీటి నిల్వలను పెంచడం ద్వారా భూగర్భ జలాలను పెంచవచ్చునని ఎమ్మెల్యే రోషన్ కుమార్ పేర్కొన్నారు. రాష్ట్రంలో రహదారులు అభివృద్ధి మౌలిక సదుపాయాల కల్పన, వ్యవసాయ రంగాన్ని శాస్త్ర సాంకేతిక రంగాలను అభివృద్ధితో పాటు ప్రకృతి వనరులను పరిరక్షణకు కూడా ముఖ్యమంత్రి అత్యధిక ప్రాధాన్య తీస్తున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. డీఎస్సీ ద్వారా 16 వేల ఉద్యోగాల నియామకం ,యువతకు ఉపాధి కల్పన, మహిళలకు శ్రీ శక్తి ద్వారా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం ఇతర అన్ని రంగాల్లో ప్రగతి పదం లో ముందుకు సాగుతున్నట్లు రోషన్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో నాలుగు మండలాల తహసిల్దారులు, యం పి డి ఓ, ఇరిగేషన్ అధికారులు నీటి వినియోగదారుల సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి శాఖల సమన్వయం అవసరం: కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్

**విశాఖపట్నం,సిటిజన్ టైమ్స్,ఏప్రియల్ :07**

జిల్లాలోని వివిధ నియోజకవర్గాల్లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలు, ప్రతిపాదనలు మరియు వాటి పురోగతిపై జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి నియోజకవర్గంలో ఉన్న సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు శాఖల మధ్య సమన్వయం అత్యవసరమని తెలిపారు. పెండింగ్ పనులను నిర్దిష్ట కాలపట్టికలో పూర్తి చేసి, ప్రజలకు త్వరితగతిన ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భీమిలి నియోజకవర్గంలో చేపట్టిన కీలక ప్రాజెక్టుల పురోగతిని సమీక్షిస్తూ, ఆర్టీసీ డిపో నిర్మాణం, మధురవాడలో పీహెచ్‌సీ భవన నిర్మాణం, భీమిలి బీచ్ రోడ్ సుందరీకరణ, రహదారుల విస్తరణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. సెజ్ ద్వారా మహిళా పారిశ్రామిక వేత్తలకు ప్రోత్సాహం కల్పించాలన్నారు. ఆనందపురంలో కొత్త అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేయాలని, శాటిలైట్ సిటీ అభివృద్ధి పనులు, మధురవాడలో సబ్‌స్టేషన్ నిర్మాణం, మత్స్యకారుల కోసం ల్యాండింగ్ సెంటర్ల ఏర్పాటు, కొత్త కన్వెన్షన్ సెంటర్ నిర్మాణంపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. విశాఖ దక్షిణ నియోజకవర్గంలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల అమలులో వేగం పెంచాలని సూచించారు. సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటు, ఎస్‌ఎన్‌ఎల్ కాలువ పనులు





చేపట్టాలని ఆదేశించారు. గోకుల్ పార్క్ అభివృద్ధి, పాత షాపింగ్ కాంప్లెక్స్ తొలగించి సర్వతి పార్క్ నిర్మాణం, టిడ్కో ఇళ్ల నిర్మాణం, కేజీహెచ్ అభివృద్ధి, స్లమ్ పునరావాస కార్యక్రమాల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని తెలిపారు. జిల్లాలోని ఇతర నియోజకవర్గాల అభివృద్ధి పనులపై కూడా సమీక్ష నిర్వహించిన కలెక్టర్, ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు అధికారులు ముందడుగు వేయాలని సూచించారు. పెండింగ్ పనులపై స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, విధాన పరమైన సమస్యల పరిష్కారానికి తక్షణ ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, జిల్లా రెవెన్యూ అధికారి ఎం. విశ్వేశ్వర నాయుడు, ఇంచార్జ్ ఆర్డీవో శేష శైలజ, జీవీఎంసీ ఏడీసీ సత్యవేణి, తదితర శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ప్రతి హామీ నెరవేరుస్తాం తర్లువాడ రైతులకు గంటా భరోసా



**ఎంవీపీ/విశాఖ, సిటిజన్ టైమ్స్,ఏప్రియల్ :07**

రాష్ట్ర అభివృద్ధికి కీలకమైన గూగుల్ డేటా సెంటర్ కోసం భూములు ఇచ్చిన రైతుల త్యాగాన్ని ప్రభుత్వం ఎప్పటికీ మరవదని, వారికి ఇచ్చిన ప్రతి హామీని తప్పకుండా నెరవేర్చుతామని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు భరోసా ఇచ్చారు. మంగళవారం ఎంవీపీ కాలనీ క్యాంప్ కార్యాలయంలో తర్లువాడ రైతులతో ఆయన సమావేశమయ్యారు. ఈ నెల 28న గూగుల్ డేటా సెంటర్ శంకుస్థాపనకు ముందే నష్టపరిహారం, భూముల కేటాయింపు, ఉపాధి అవకాశాలు కల్పించాలని రైతులు విన్నవించారు. గుడిలోవ నుంచి డేటా సెంటర్ వరకు నిర్మిస్తున్న రహదారి కోసం 2.5 ఎకరాల భూమి స్వాధీనం చేసుకుని పనులు ప్రారంభించినప్పటికీ ఇప్పటి వరకు పరిహారం అంశంపై రెవిన్యూ అధికారులు చర్చించలేదని ఇద్దరు రైతులు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే వెంటనే ఎమ్మార్వో శ్రీనుబాబుతో మాట్లాడి, భూమి సర్వే చేసి ఎంత మేర తీసుకున్నారో నిర్ధారించి పరిహారం ఫైల్ సిద్ధం చేయాలని ఆదేశించారు. రెవిన్యూ రికార్డుల్లో పేర్లలో తప్పులు ఉండటంతో కొందరికి పరిహారం అందలేదని, భూ హక్కులపై కుటుంబాల మధ్య వివాదాల నేపథ్యంలో సంబంధం లేని వ్యక్తుల పేర్లు నమోదు అయ్యాయని మరికొందరు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. జిరాయతీ భూమి, డి-పట్టా భూములకు ఒకే రీతిలో పరిహారం ప్రకటించడంపై మరో రైతు అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీల ప్రకారం 51 మందికి జాతీయ రహదారి పక్కన షాపింగ్ కాంప్లెక్స్‌లో 20ఇ25 సైజు షాపులు, ప్రతి కుటుంబానికి ఒక అవుట్‌సోర్సింగ్ ఉద్యోగం, 620 మందికి 3 సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలు ఇవ్వాలని రైతులు కోరారు. అలాగే ఎకరా డి-పట్టా భూమికి 20 సెంట్ల చొప్పున భూమి పత్రాలు శంకుస్థాపనకు ముందే అందించాలని డిమాండ్ చేశారు. ఈ విషయాలపై స్పందించిన గంటా శ్రీనివాసరావు ప్రభుత్వం చెప్పిన ప్రతి హామీని అమలు చేస్తుందని స్పష్టం చేశారు. ఎలాంటి అపోహలకు తావు లేదని పేర్కొన్నారు. ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి, ఏపీఐఐసీ ఎండీ, ప్రస్తుత జిల్లా కలెక్టర్, పూర్వ జిల్లా కలెక్టర్‌లతో ఫోన్ కాన్ఫరెన్స్ నిర్వహించి రైతుల సమస్యలకు పరిష్కారం కనుగొంటామని తెలిపారు. భూములు ఇచ్చిన రైతులు కూడా గూగుల్ సంస్థలాగే సంతోషంగా ఉండేలా పరిహారం ఉండాలని సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేసిన మేరకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఈ సందర్భంగా పరిహారం, ఇతర ప్రయోజనాల విషయంలో అధికారుల స్పందన తగినంతగా లేదని ఆగ్రహం వ్యక్తం చేసిన రైతులు, ఎలాంటి నష్టం కలగకుండా చూసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇవ్వడంతో శాంతించారు. టీడీపీ ప్రభుత్వం, గంటా ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న నేపథ్యంలో పరిహారం విషయంలో అసంతృప్తి ఉన్నప్పటికీ కోర్టులను ఆశ్రయించలేదని రైతులు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిక్కాల విజయ్ బాబు, ఘట్టమనేని సుభాష్ చంద్రబోస్, తాత్రాజు అప్పారావు, బి.ఆర్.బి. నాయుడు, బాలి అయ్యప్ప, మజ్జి శ్రీను, కోరాడ ఆదినారాయణ, బంకు రాజు తదితరులు పాల్గొన్నారు.

# గ్యాస్ డెలివరీ బాయ్స్‌పై దాడులు ఆపండి

## ఏపీ ఎల్.పి.జి డిస్ట్రిబ్యూటర్ల హెచ్చరిక

**విజయవాడ :( సిటిజన్ టైమ్స్ ): ఏప్రిల్ 07**

రాష్ట్రంలో గ్యాస్ కొరత ఉందన్న అపోహలతో ప్రజలు డెలివరీ బాయ్స్‌పై దాడులకు తెగబడటం పట్ల ఆంధ్రప్రదేశ్ ఎల్.పి.జి డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. విజయవాడలో నిర్వహించిన అన్ని జిల్లాల డిస్ట్రిబ్యూటర్ల సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనాధ రెడ్డి మాట్లాడుతూ, ప్రస్తుత పరిస్థితులు ఇలాగే కొనసాగితే ఏజెన్సీలు మూసివేస్తామని, గ్యాస్ డెలివరీ నిలిపివేస్తామని హెచ్చరించారు. ఇచ్ఛాపురం, మచిలీపట్నం వంటి ప్రాంతాల్లో ప్రజలు తమ సిబ్బందిపై భౌతిక దాడులకు పాల్పడుతున్నారని, బండిపై ఉన్న సిలిండర్లను కూడా ఎత్తుకెళ్తున్నారని అధ్యక్షులు పేర్కొన్నారు. ప్రాణ భయంతో చాలా మంది డెలివరీ బాయ్స్ ఇప్పటికే పనుల నుంచి తప్పుకున్నారని తెలిపారు. గ్యాస్ సరఫరా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పర్యవేక్షణలో జరుగుతుందని, కస్టమర్ మొబైల్‌కు ఓటీపీ వస్తేనే డెలివరీ చేసే అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నగరాల్లో 25 రోజులు, గ్రామాల్లో 45 రోజుల కంటే ముందు సిలిండర్ ఇవ్వడం సాధ్యం కాదన్నారు. ఐ.వి.ఆర్.యస్ ( ఐ వి ఆర్ ఎస్ ) సర్వేపై అభ్యంతరం: డెలివరీ బాయ్స్ ఐదారు అంతస్తులు ఎక్కి కష్టపడి పనిచేస్తున్నారని, అయితే ప్రభుత్వం




చేస్తున్న ఐ.వి.ఆర్.యస్ సర్వే ద్వారా వారిని ఇబ్బంది పెట్టడం సరికాదని అసోసియేషన్ అభిప్రాయపడింది. కమర్షియల్ గ్యాస్‌ను బ్లాక్‌లో అమ్ముతున్నామనే ఆరోపణలను వారు తోసిపుచ్చారు. ఇప్పుడున్న వ్యవస్థలో ఒక్క సిలిండర్ కూడా పక్కదారి పట్టించే అవకాశం లేదని, ఏవైనా తప్పులుంటే అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. సుమన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి శంకర్ మాట్లాడుతూ. ఏపీలో గ్యాస్ కొరత లేదని, ప్రజలు అనవసరంగా బుక్ చేసి సాఫ్ట్‌వేర్‌పై భారం వేయవద్దని కోరారు. యుద్ధం వంటి కారణాల వల్ల చిన్నపాటి ఇబ్బందులు ఉన్నా, ప్రభుత్వం తీసుకున్న చర్యల వల్ల సరఫరా సజావుగానే సాగుతోందని వివరించారు?

# బందన పూడి టిడిపి గ్రామ కమిటీ ప్రమాణ స్వీకారం



**కాకినాడ జిల్లా రూరల్,సిటిజెన్ టైమ్స్,ఏప్రిల్ 7**

బందన పూడి టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షుని గా మోకన సత్యం ప్రమాణ స్వీకారం చేశారు, సత్యం గత కొన్ని సంవత్సరాలనుండి బూత్ లేవిల్ లో టిడిపి పార్టీ కీ పనిచేయడం వలన కమిటీ అధ్యక్షులు నియమించడం జరిగింది . సత్యంతో పాటు వైస్ ప్రసిడెంట్ గా తలాటం సత్తిరాజు, కమిటీ సభ్యులు కాజులూరు మండలం టిడిపి అధ్యక్షులు చావ్వాకుల న్నారాయణ మూర్తి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమం లో సలాది సాయిబాబు. జక్కన రాజేష్. మోకన వాడపల్లి. మోకన ఈశ్వరరావు. గ్రామస్తులు పాల్గొన్నారు.

## గ్రామాలలో అధికారుల బాధ్యతలు చేపడుతున్న సందర్భంగా సన్మాన కార్యక్రమం



**కాకినాడ జిల్లా ఏప్రిల్ 7 సిటిజెన్ టైమ్స్**

పిఠాపురం నియోజవర్గం గొల్లప్రోలు మండల గ్రామల సర్పంచ్ పదవి కాలం పూర్తి కావడం వలన ప్రతి గ్రామంలోను అధికారుల బాధ్యతలు చేపడుతున్న సందర్భంగా అధికారులు ఎంపీడీవో సెల్యూట్ రాజ్, దుర్గాడ గ్రామం, వన్నెపూడి,కొడవలి గ్రామం,రామ్ కుమార్ తాసిల్దార్ తాడిపర్తి గ్రామం అగ్రికల్చర్ ఏవో సత్యనారాయ డిప్యూటీ ఎంపీడీవో విద్య సాగర్ చందుర్తి చిన్న జగ్గంపేట ఎంఈఓ 2 శివప్రసాద్ విజయనగరం ఏకే మల్లవరం బాధ్యతలు స్వీకరిస్తున్న సందర్భంగా రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ నక్క నారాయణ మూర్తి చేతుల మీదుగా అధికారులకు దుసలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు గొల్లప్రోలు మండల మాజీ ప్రెసిడెంట్ అమరాదల్ల రామకృష్ణ, మాజీ వార్డ్ మెంబర్ దొడ్డిపట్ల బాబులు, గొల్లమ్మ గంగా ఈశ్వర్, చందుర్తి కొనేళ్ల అప్పారావు, బీసీ నాయకులు నక్కా బద్రి, వన్నెపూడి మీ ఇళ్ళ నాగబాబు, దొడ్డిపట్ల వెంకటరమణ, దుర్గాడ మాజీ సర్పంచ్ సూరి చందర్రావు, దెయ్యాల చంద్రబాబు స్పెషల్ ఆఫీసర్లు మర్యాదపూర్వకంగా కలిసి, కార్యకర్తలు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గొల్లప్రోలు మున్సిపాలిటీ 3వ గ్రేడ్‌కు ఉత్తీర్ణత పొందినందుకు జనసేన నేతృత్వంలో అంబరాన్ని అంటిని సంబరాలు




**కాకినాడ జిల్లా సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 7**

పిఠాపురం నియోజకవర్గ శాసనసభ్యులు మరియు ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ కృషితో పిఠాపురం నియోజకవర్గం గొల్లప్రోలు నగర పంచాయతీని మున్సిపాలిటీ(3తీఽ గ్రేడ్) గా ఉత్తీర్ణత చేస్తూ ప్రభుత్వం వారు ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా పిఠాపురం నియోజకవర్గం గొల్లప్రోలు జనసేన నాయకులు కదారి తమ్మయ్య నాయుడు ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ కు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కదారి తమ్మయ్యా నాయుడు మాట్లాడుతూ మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ గొల్లప్రోలు వీక్షించినప్పుడు పవన్ కళ్యాణ్ నియోజవర్గంలో గొల్లప్రోలు మున్సిపాలిటీకి ప్రత్యేక స్థానం కల్పించాలని విజ్ఞాపన చేయగా దానిపై స్పందించిన మున్సిపల్ మంత్రి నారాయణ సానుకూలంగా స్పందించారని దానికి నిర్వచనం గొల్లప్రోలు మున్సిపాలిటీని 3 గ్రేడ్ కు ఉత్తీర్ణం చేశారని అన్నారు. అనంతరం అమృత పథకంలో రంగమ్మ చెరుకు ఐదు కోట్ల రూపాయలు నిధులు విడుదల చేయడం జరిగింది. దానిని సూర్య చెరువుకి ఆ నిధులను మార్చడం జరిగిందని దానికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని దానికి ప్రత్యేకంగా గొల్లప్రోలు పట్టణం నుండి జనసేన నాయకులు కదారి తమ్మయ్య నాయుడు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు, జనాసైనికుల, వీర మహిళలు అందరూ కలిసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు జన సైనికులు వీర మహిళలు పట్టణ ప్రముఖులు మున్సిపల్ ఆఫీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాల మౌలిక వసతులు పై నిర్లక్ష్యం





**అంబాజీపేట సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 7**

అంబాజీపేటలోని జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి విచారణ ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు డా.నాగ మానస , విచారణ చేశారు. పాఠశాలలో ఇటీవల చోటుచేసుకున్న సంఘటనపై సంబంధిత అధికారులు, సిబ్బంది నుండి సమగ్ర వివరాలు సేకరించారు. విద్యార్థుల భద్రత, పాఠశాల మౌలిక వసతులు, పర్యవేక్షణ వ్యవస్థలో ఉన్న లోపాలను క్షుణ్ణంగా డా. నాగ మానస పరిశీలించారు , బాధ్యుల నిర్లక్ష్యంపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. బాలల హక్కుల ఉల్లంఘనకు సంబంధించిన అంశాలపై చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని స్పష్టంగా హెచ్చరిస్తూ, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా తక్షణమే సరిదిద్దు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సంఘటన వివరాల ప్రకారం, అంబాజీపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థి మణికంఠను పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా జెండాలు పాతే పనిలో పాల్గొనాల్సిందిగా చేయడంతో, గుణపం తగిలి అతని మధ్యవేలు తీవ్రంగా గాయపడింది. ఈ సంఘటన పాఠశాల స్థాయిలో బాలల భద్రతపై ఉన్న ఘోర నిర్లక్ష్యాన్ని స్పష్టంగా ప్రతిబింబిస్తోందని కమిషన్ సభ్యురాలు పేర్కొన్నారు. పరిశీలన సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో వంటశాల పరిసరాలు, టాయిలెట్లు, తరగతి గదుల్లో అవసరమైన పరిశుభ్రత ప్రమాణాలు పాటించబడకపోవడాన్ని డా. నాగ మానస గుర్తించారు. ఈ పరిస్థితులు విద్యార్థుల ఆరోగ్యానికి తీవ్రమైన ప్రమాదంగా మారే అవకాశం ఉందని హెచ్చరిస్తూ, మౌలిక సదుపాయాల నిర్వహణలో పాఠశాల యాజమాన్యం పూర్తిగా విఫలమైందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. బాలలను శారీరక ప్రమాదాలకు గురిచేసే విధంగా పనులు చేయించడం చట్ట విరుద్ధమని, దీనిపై బాధ్యులపై చట్టపరమైన చర్యలు తప్పవని కమిషన్ స్పష్టం చేసింది. విద్యార్థుల భద్రతే ప్రధాన లక్ష్యంగా పాఠశాలలు పనిచేయాలని, నిర్లక్ష్యానికి ఇకపై ఎలాంటి సడలింపులు ఉండవని డా.నాగ మానస కఠిన హెచ్చరిక జారీ చేశారు.

## పదవి విరమణ సన్మాన సభ...

ఎమ్మెల్యే దేవ..





**సఖినేటిపల్లి సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ 6**

డా బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలం సఖినేటిపల్లిలంక గ్రామ పంచాయతీ నందు నిర్వహించిన సర్పంచ్ రేపూరి రాజేశ్వరి ఏసు నరసింహరాజా పదవి విరమణ సన్మాన సభలో ముఖ్య అతిథిగా రాజోలు శాసన సభ్యులు దేవ వరప్రసాద్ పాల్గొన్నారు. ఎమ్మెల్యే దేవ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి కోసం సర్పంచ్‌గా ఉన్న కాలంలో రేపూరి రాజేశ్వరి చేసిన సేవలను అభినందించారు. గ్రామ ప్రజల సహకారంతో పలు అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించడం అభినందనీయమని తెలియజేశారు. ఈ ప్రాంతానికి ముఖ్యమైన కార్యక్రమం రూ. 7.10 కోట్ల వ్యయంతో నిర్మించబడనున్న ఏటిగట్టు డబుల్ రోడ్డు సఖినేటిపల్లిలంక బోను నుండి గుడిమూల వరకు 5.5 కిలోమీటర్ల పొడవున అంతర్వేది శ్రీ నరసింహస్వామి దేవాలయానికి వెళ్లే రహదారి నిర్మాణానికి ఈ నెల 09వ తేదీన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ పర్చువల్ గా శంకుస్థాపన చేయునున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఇంచార్జ్ గొల్లపల్లి అమూల్య, గోదావరి డిస్ట్రిబ్యూషన్ చైర్మన్ ఆకన బాబ్జినాయుడు, ఏఎంసి ఉప చైర్మన్ శ్రీనివాసు, గుబ్బల ఫణి కుమార్, కొండా కిషోర్, ఎన్డీఏ కూటమి నాయకులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కాకినాడ కలెక్టర్‌ని మర్యాదపూర్వక కలిసిన పార్లమెంట్ సభ్యులు



**కాకినాడ సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 7**

కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ మంగళవారం కాకినాడ కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ను మర్యాదపూర్వకంగా కలిశారు..

## రాష్ట్రంలో వైసీపీ అరాచకాలు రోజురోజుకు పెరుగుతున్నాయి

*ఆంధ్రజ్యోతి కార్యాలయాలపై దాడి - ప్రజాస్వామ్యంపై దాడి.*

*దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ వెల్లడి -పత్రికా స్వేచ్ఛను హరించడం హేయమైన చర్య.*


*దాడులతో గొంతు నొక్కలేరు - నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి.*

**దెందులూరు, ( సిటిజన్ టైమ్స్): ఏప్రిల్ 07**

ప్రముఖ తెలుగు దినపత్రిక ఆంధ్రజ్యోతి కార్యాలయాలపై వైసిపి నాయకుల భౌతిక దాడులను దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభమైన మీడియాపై ఇలాంటి దాడులు జరగడం అత్యంత దురదృష్టకరమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ: "వార్తలు నచ్చకపోతే ప్రజాస్వామ్యబద్ధంగా సమాధానం చెప్పాలీ , నిరసన తెలియచేయాలి తప్ప, కార్యాలయాలపై దాడులకు తెగబడటం సరికాదు అని మండిపడ్డారు. పత్రికా స్వేచ్ఛను అణచివేయాలని చూడటం అంటే రాజ్యాంగాన్ని అవమానించడమేనని అభిప్రాయపడ్డారు. వైసిపి హయాంలో గత ఐదేళ్లుగా రాష్ట్రంలో మీడియాపై అరాచకాలు సాగాయని, కూటమి ప్రభుత్వంలో ఇటువంటి దౌర్జన్యాలకు తావులేదని ఆయన స్పష్టం చేశారు."

**నిందితులను కఠినంగా శిక్షించాలి:**

దాడికి పాల్పడిన వైసీపీ నాయకులపై వారి వెనుక ఉన్న శక్తులపై పోలీసులు తక్షణమే విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. బాధ్యతాయుతమైన జర్నలిజం చేస్తున్న ఆంధ్రజ్యోతి యాజమాన్యానికి మరియు జర్నలిస్టులకు తమ ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఇలాంటి దాడుల వల్ల మీడియా గొంతును ఎవరూ నొక్కలేరని, వాస్తవాలను ప్రజల ముందు ఉంచడంలో



పాత్రికేయులు ధైర్యంగా ముందుకు సాగాలని ఆయన కోరారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడటంలో మీడియా పాత్ర కీలకమని, అటువంటి సంస్థల రక్షణకు అందరూ ఐక్యంగా నిలబడాలని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పిలుపునిచ్చారు.

## ఏప్రిల్ 9న ఓటర్ల ఉద్యోగులకు సెలవు మంజూరు

కాకినాడ కలెక్టర్



**కాకినాడ సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 07**

భారత ఎన్నికల సంఘం పపుదుచ్చేరి శాసనసభ సాధారణ ఎన్నికలు 2026 కు సంబంధించి యానాం నియోజకవర్గంలో ఈ నెల 09న పోలింగు జరగనున్న నేపథ్యంలో పుదుచ్చేరి కేంద్రపాలిత ఓటర్లు ప్రస్తుతం కాకినాడ జిల్లాలో పనిచేస్తున్నట్లయితే, వారు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఏప్రిల్ 9 న వేతనంతో సెలవు మంజూరు చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సెలవు పుదుచ్చేరి యూటీకి చెందిన ఓటర్లకు మాత్రమే వర్తిస్తుందని ఆయన తెలిపారు. కాకినాడ జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు ఈ సూచనలను ఖచ్చితంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి హరేంధిరప్రసాద్ ఆదేశించారు.

## రేషన్ షాపులను తనిఖీ చేసిన ఎమ్మార్వో



**లింగపాలెం ( సిటిజన్ టైమ్స్) ఏప్రియల్ :07:**

ఏలూరు జిల్లా లింగపాలెం మండలంలో లింగపాలెం ఎమ్మార్వో నజీముల్లాషా మంగళవారం రేషన్ షాపులను తనిఖీ చేశారు 1వ నెంబర్ డీలర్ షాపులను తనిఖీ చేసి డీలర్లు అందరికీ తెలియజేస్తూ కార్డుదారులని పలకరించే విధానం గురించి తెలిపారు రేషన్ బియ్యాన్ని సక్రమంగా అందజేయాలన్నారు డీలర్లు అందరూ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 9 గంటల వరకు షాపులను తెరిచి ఉంచాలని డీలర్లకు ఆదేశించారు.

## ఆత్రేయపురం మండలంలో రూ.2.85 కోట్లతో చేపట్టిన విద్యుత్ ఆధునీకరణ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే బండారు...

ఆత్రేయపురం మండల ప్రజల దీర్ఘకాలిక విద్యుత్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది...

కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు....




**ఆత్రేయపురం సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 7**

ఆత్రేయపురం మండల వాసులు సుదీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలకు నేటితో పరిష్కారం లభించిందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. ఆదివారం ఆయన ఆత్రేయపురం మండలంలో పెరవరం ఎటిగట్టు మరియు సబ్ స్టేషన్ దగ్గర ఉన్న విద్యుత్ ఆధునీకరణ పనులను ప్రారంభించారు. మొదటగా బొమ్మూరు 220 కెవి సబ్ స్టేషన్ నుండి ఆత్రేయపురం మండలం పెరవరం గోదావరి నది మీదుగా వచ్చే పాత టవర్ లైన్స్ స్థానంలో రూ.50లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన కొత్త పాంథర్ కండక్టర్ ను జిల్లా ఈపీడీసీఎల్ సూపరిండెంట్ రాజేశ్వరి దేవి, కన్స్ట్రక్షన్ డీఈ విజయానంద్, అమలాపురం డిఈ రాంబాబు తదితరులతో కలిసి ప్రారంభించారు. అనంతరం పెరవరం సబ్ స్టేషన్ వద్ద పులిదిండి, వద్దిపర్రు, వెలిచేరు గ్రామాలకు 24 గంటలు 3 ఫేజ్ విద్యుత్ సరఫరా చేయుటకు రూ.2.35కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన 11కె.వి లైన్, ట్రాన్స్ఫార్మర్లు,11కె.వి బ్రేకర్ ను ప్రారంభించారు. రాబోయే నాలుగైదు ఏళ్లకు కూడా ఎటువంటి విద్యుత్ ఇబ్బందులు లేకుండా చేయాలన్న ఆలోచనతో పెద్ద ఎత్తున మన నియోజకవర్గంలో ఆర్డీఎస్ఎస్ పనులు చేపట్టి, పూర్తి చేసుకుంటున్నామన్నారు. ఆత్రేయపురం మండలానికి సంబంధించి బొమ్మూరు నుంచి వచ్చే వైరు పురాతనమైనది కావడంతో ఎన్నోసార్లు తెగిపోవడం జరిగేదన్నారు. గోదావరిలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్నప్పుడు, ఈ లైన్ తెగిపడితే మరమ్మత్తులు చేయడానికి రెండు నుంచి మూడు నెలల వరకు సమయం పట్టేదన్నారు. దీని వలన ఆత్రేయపురం మండల ప్రజలు, ముఖ్యంగా రైతులు, విద్యార్థులు, చిన్న వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారన్నారు. ఈ సమస్యలను దృష్టిలో పెట్టుకుని, ప్రభుత్వం వెంటనే స్పందించి గోదావరి మీదుగా ఉన్న పాత వైరు తొలగించి, దాని స్థానంలో శక్తివంతమైన పాంథర్ కండక్టర్ను అమర్చిందన్నారు. ఆత్రేయపురం మండలానికి కొత్తపేట సబ్ స్టేషన్ నుంచి లైన్ రావడం చాలా దూరం అవుతుందని, అందుకే బొమ్మూరు నుంచి వచ్చే లైన్ ను ఆధునీకరించడంతో ఇబ్బందులు తొలగిపోయాయన్నారు. ఆంధ్ర ప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ప్రజల యొక్క మేలే తమకు ముఖ్యమనుకుని, ప్రజలకు 24 గంటలు సరఫరా ఇవ్వాలనే లక్ష్యంతో రైతులకు 9 గంటల విద్యుత్ సరఫరా ఇవ్వాలని ఆర్డీఎస్ఎస్ అనే పథకంలో ప్రతి గ్రామంలో త్రీఫేస్, సింగల్ ఫేస్ ట్రాన్స్ఫార్మర్లు,కొత్తగా లైన్లు వేయడం, పాత కరెంటు స్తంభాలు తీసి కొత్తవి వేయడం చేస్తుందన్నారు. అన్ని సరిదిద్దుకుంటూ రాబోయే నాలుగైదు ఏళ్లకు విద్యుత్ ఇబ్బందులు లేకుండా చేయాలని ఆలోచనతో పెద్ద ఎత్తున ఆర్డీఎస్ఎస్ పనులు చేసుకుంటున్నామన్నారు. ఎక్కడ ఏ విధమైన లో వోల్టేజ్ ఉన్న ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటు చేసే సరిదిద్దుదామని ఎస్ ఈ చెప్పారని ఎమ్మెల్యే అన్నారు. ఆత్రేయపురం మండలంలో నేడు ప్రారంభించుకున్న పనులతో దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలు పరిష్కారమయ్యాయన్నారు. త్రీఫేస్ సరఫరా ఇక నిరంతరంగా వస్తుందన్నారు. ఎవరైనా చిన్న చిన్న పరిశ్రమలు పెట్టుకున్న ఇబ్బందులు ఉండవన్నారు. లో వోల్టేజ్ సమస్య కూడా తీరిపోతుందన్నారు. వరదల సమయంలో కూడా విద్యుత్ సరఫరా అంతరాయం తగ్గి, అత్రేయపురం మండలానికి నిరంతర, నాణ్యమైన విద్యుత్ అందుబాటులో ఉంటుందన్నారు. కోనసీమ ప్రాంతంలో కరెంట్ లైన్లు ఎక్కువగా చెట్ల మధ్య నుంచి వెళ్తున్నాయని దీని వలన చెట్టు కొమ్మలు, ఆకులు లైన్లపై పడటం వల్ల తరచుగా విద్యుత్ అంతరాయం ఏర్పడుతోందన్నారు. ఈ సమస్యను పరిష్కరించడానికి సుమారు రూ.3.60 కోట్లతో ప్రస్తుతం 33/11కెవి బిళ్లకుర్రు సబ్ స్టేషన్ కు వెళ్లే సుమారు 8 కిలో మీటర్లు 33 కెవి మెయిన్ లైన్ను ప్లాస్టిక్ కోటింగ్ ఉన్న కవర్డ్ కండక్టర్ తో మార్చడం జరిగిందన్నారు. ఈ కవర్డ్ కండక్టర్ వలన గాలి వీచినా, వర్షం పడినా, చెట్టు ఆకులు లేదా కొమ్మలు లైన్లపై పడినా కరెంట్ నిలిచిపోవడం దాదాపుగా ఉండదన్నారు. దీంతో ప్రజలకు నిరంతర మరియు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందుతుందన్నారు. అలాగే ఎస్సీ, బీసీ,ఓసి వర్గాలన్నీ సబ్సిడీపై ప్రభుత్వం అందిస్తున్న సోలార్ రూఫ్ టాప్ పథకాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాకినాడ కలెక్టర్ ని మర్యాదపూర్వకంగా కలిసిన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిషత్ చైర్మన్

**కాకినాడ సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 7**

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజా పరిషత్ చైర్పర్సన్ విప్పర్తి వేణుగోపాలరావు మంగళవారం కాకినాడ కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ను మర్యాదపూర్వకంగా కలిశారు.



## కాకినాడ కలెక్టర్ ని మర్యాదపూర్వక కలిసిన ముమ్మిడివరం ఎమ్మెల్యే

**కాకినాడ సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 7**

రాష్ట్ర ప్రభుత్వం విప్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బారాజు మంగళవారం కాకినాడ కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ను మర్యాదపూర్వకంగా కలిశారు.



# జూన్ నాటికి వెలుగొండ పనులను పూర్తి చేయాలి

## అధికారులకు జల వనరులశాఖ మంత్రి రామానాయుడు ఆదేశం





**ప్రకాశం, సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 7**

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ప్రధానమైన వెలుగొండ ప్రాజెక్టు పనులను జూన్ నాటికి పూర్తి చేసేందుకు అధికారులు యుద్ధ ప్రాతిపదికన పనులను పూర్తి చేయాలని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు. మంగళవారం ఆయన మార్కాపురం,, గిద్దలూరు ఎమ్మెల్యేలు కందుల నారాయణరెడ్డి ముత్తుముల అశోక్ రెడ్డి, యర్రగొండపాలెం తెదేపా ఇన్చార్జి ఎరిక్షన్ బాబు లతో కలిసి కొల్లం వాగు నుంచి సొరంగం ద్వారా ప్రయాణించి పనుల పనితీరును స్వయంగా పరిశీలించారు. అనంతరం దోర్నాల టన్నెలు వద్దకు చేరుకొని ఫీడర్ కెనాల్ పనులను పరిశీలించారు. ఫీడర్ కెనాల్ వద్ద వెలిగొండ ప్రాజెక్టు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామనాయుడు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ ప్రాజెక్టుపై ప్రతి పది రోజులకు ఒకసారి అడిగి తెలుసుకుంటున్న విషయాన్ని వివరించారు. 70 శాతం హెడ్ రెగ్యులేటర్ పనులు పూర్తయినట్లు మంత్రి తెలిపారు. అదేవిధంగా టన్నేల్ వన్ లో 1.20 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని యుద్ధ ప్రాతిపదికన తొలగించాలని అధికారులకు తెలిపారు. నిర్వాసితులకు చెల్లించాల్సిన 900 కోట్ల రూపాయలను ఏప్రిల్ నుంచి జూన్ వరకు విడతల వారీగా చెల్లిస్తామని వివరించారు. వచ్చే రెండు నెలల్లో పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకొని ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 20 నెలల్లో ప్రాజెక్టుకు సంబంధించి 1200 కోట్ల బిల్లులు చెల్లించామని వివరించారు. ఇన్ని పనులు ఉన్న వెలుగొండ ప్రాజెక్టును జాతికి అంకితం చేసినట్లు చెప్పి మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మాయల మరాఠీని మరిపించేలా వ్యవహరించారని ఎద్దేవ చేశారు. ఇప్పటికైనా ప్రజలు వాస్తవాలను గ్రహించి తమ ప్రభుత్వాన్ని ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత, వెలుగొండ ప్రాజెక్టు సీఈ కె.రమేష్, ఎస్ఈ అబు తలీం, ఈఈ కృష్ణారెడ్డి, డీఈ రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.

# మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ



**సి ఎస్ పురం, సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 7**

మండల కేంద్రమైన సిఎస్పురం లో ఎండలు తీవ్రత ఎక్కువ ఉండడంతో మండలంలోని రామాపురం గ్రామానికి చెందిన పిడతల చిరంజీవి మజ్జిగ ప్యాకెట్లను మంగళవారం స్థానిక బస్టాండ్ సెంటర్లో ప్రయాణికులకు వృద్ధులకు పంపిణీ చేశారు వేసవిలో చిరంజీవి ఉచితంగా మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేయడం అభినందనీయమని పలువురన్నారు ఈ కార్యక్రమంలో రేనాటి వెంకట్ నారాయణ కసీదు నవీన్ సోమిశెట్టి సుబ్బ రాచమడుగు ప్రదీప్ తదితరులు ఉన్నారు.

# దేశానికి దిక్సూచిగా మారనున్న ఏపి రాజధాని

### బిజెపి రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి


**మార్కాపురం, సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 7**



ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న కీలక నిర్ణయానికి మరింత బలం చేకూరింది. ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ (సవరణ) చట్టం-2026కు భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలుపగా, కేంద్ర గెజిట్ విడుదల చేయడంతో ఈ చట్టం అధికారికంగా అమలులోకి వచ్చింది. ఈ పరిణామంపై బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. అమరావతిని ఆంధ్రప్రదేశ్ శాశ్వత రాజధానిగా నిలబెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం చారిత్రాత్మకమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ లకు కూడా ఆయన ధన్యవాదాలు తెలిపారు. అమరావతి రాజధాని అంశంపై గతంలో నెలకొన్న అనేక అపోహలు, అనిశ్చితులు ఈ చట్టంతో పూర్తిగా తొలగిపోయాయని డాక్టర్ రామచంద్రారెడ్డి అభిప్రాయపడ్డారు. ఇకపై రాజధాని అభివృద్ధి వేగంగా జరుగుతూ, రాష్ట్రానికి పరిపాలనా స్థిరత్వం కలుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం రాష్ట్ర ప్రజల్లో నూతన విశ్వాసాన్ని నింపడమే కాకుండా, అభివృద్ధి దిశగా అమరావతిని మరింత ముందుకు తీసుకెళ్లే దిశగా కీలక మైలురాయిగా నిలుస్తుందని అశాభావం వ్యక్తం చేశారు. అలాగే దేశానికి ఏపి రాజధాని అమరావతి దిక్సూచిగా మారనుందని అన్నారు.

# రెండుపూటలా పాఠశాలలు నిర్వహిస్తే చర్యలు

### -ఎంఈఓ నాగకుమార శర్మ



**కందుకూరు, సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 7**

ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా రెండు పూటలా పాఠశాలలు నిర్వ హిస్తే చర్యలు తప్పవని కందుకూరు మండల విద్యాశాఖాధికారి ఎం. నాగకుమార శర్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేసవి తీవ్రత దృష్ట్యా మార్చి 15వ తేదీ నుంచి ప్రభుత్వం ఒంటి పూట బడులను నిర్వహిస్తుందన్నారు. పలు ప్రైవేటు పాఠశాలల వారు రెండు పూటలా పాఠశాలలు నిర్వహిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరూ కూడా పాఠశాలలను రెండు పూటలా నిర్వహించకూడదన్నారు. అలాగే ప్రభుత్వ ఆదేశాలకు మేరకు తల్లిదండ్రులు మీ యొక్క పిల్లలను (విద్యార్థులను) ప్రైవేటు పాఠశాలలకు ఒంటి పూట మాత్రమే పంపించవలనని ఆయన విన్నవించారు. మండల పరిధిలో ఏ ప్రైవేట్ పాఠశాలనైనా రెండు పూటలా నిర్వహిస్తే అట్టివారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోనున్నట్లు ఆయన తెలిపారు.

# పశ్చిమ ఆసియా యుద్ధం ప్రపంచానికి ముప్పు

## యుద్ధ విరమణ చెయ్యాలి - యూటీయఫ్, జెవివి



**గిద్దలూరు, సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 7**

ప్రస్తుతం పశ్చిమ ఆసియాలోని ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయెల్ దాడిని ఖండిస్తున్నట్లు తక్షణమే అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధ విరమణ చర్యలు తీసుకోవాలని యూటీయఫ్ సీనియర్ నాయకులు మీగడ వెంటేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం గిద్దలూరు యూటీయఫ్ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి డా. మొర్రి పిచ్చయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడుతూ గత 38 రోజులుగా జరుగుతున్నా అమెరికా సామ్రాజ్యవాదం నేడు ప్రపంచానికి ముప్పుగా మారిందన్నారు. అనేక దేశాలు గ్యాస్, ఆయిల్ కొరతతో ఆర్థిక సంక్షోభంలో కురుకుపోయాయని, హోర్మోజ్ జలసంధి ద్వారా జరిగే ఇంధన సరఫరా ఆగిపోవడంతో, ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు ధరలు ఆకాశాన్ని అంటాయన్నారు. దానితో మన దేశంలో కూడా ఎరువులు, విద్యుత్, పారిశ్రామిక రంగాలు, హోటల్ పరిశ్రమ భారీగా దెబ్బ తిన్నదని తెలిపారు. ఈ ప్రభావం నిత్యావసర వస్తువులపై పడే అవకాశం ఉందని తెలిపారు. అంతర్జాతీయముగా చమురు ధరల దాటికి రూపాయి విలువ డాలర్ తో రు95 లకు పడిపోయిందని. దానితో దేశంలో దిగుమతులు పెరిగి ఎగుమతులు తగ్గి, వాణిజ్య లోటు భారీగా పెరిగిందన్నారు.తద్వారా విదేశీ అప్పులు కూడా పెరిగిపోతున్నాయి అన్నారు. జెవివి నాయకులు స్వరూపరెడ్డి మాట్లాడుతూ అమెరికా సామ్రాజ్యవాదంతో మొన్న వెనుజుల అధ్యక్షులు మధురోను, అతని భార్యను దౌర్జన్యంగా ఎత్తుకెళ్లి అమెరికా లో జైల్లో బంధించడం, తదుపరి క్యూబా, మెక్సికో, గ్రీన్ ల్యాండ్ అని ప్రకటించడం చూస్తుంటే అమెరికా అన్ని దేశాలను స్వాదీనం చేసుకుని ఏకచత్రాధిపత్యంగా ప్రపంచాన్ని ఏలాలని చూస్తున్నట్లు ఉంది అన్నారు. కాబట్టి ఐక్య రాజ్య సమితి జోక్యం చేసుకుని యుద్ధాన్ని ఆపే చర్యలు తీసుకోవాలని, ప్రపంచాన్ని ఆర్థిక సంక్షోభం నుండి కాపాడాలని కోరుచున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం లో విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రవీంద్రారెడ్డి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు టీ ఆవులయ్య, యుటీయఫ్ మాజీ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ రెడ్డి, సీనియర్ నాయకులు వేమయ్య, జయచంద్ర రెడ్డి, బాల వెంకటేశ్వర్లు , ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# వరుస దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్

## ఏడు పోలీస్ స్టేషన్‌లో కేసులు




**శేరిలింగంపల్లి,(మాదాపూర్),సిటిజన్ టైమ్స్, ఏప్రిల్ 07 :**

నగరంలోని వివిధ ప్రాంతాల్లో వరుస ద్విచక్ర వాహన దొంగతనాలకు పాల్పడుతున్న నేరస్థుడిని మాదాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి రూ. 3,50,000 విలువైన 7 దొంగిలించబడిన మోటార్ సైకిళ్లను పోలీసులు రికవరీ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..నిందితుడు వరాల మురళీధర్ రావు అలియాస్ మురళి (44). ఇతను సరూర్‌నగర్‌లోని బృందావన్ కాలనీ, కూకట్‌పల్లిలోని బాలాజీ నగర్‌లో నివసిస్తూ, వృత్తిరీత్యా కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మురళి ప్రధానంగా నివాస గృహాల ముందు, రైల్వే స్టేషన్ పార్కింగ్ ప్రాంతాలు, ఇతర బహిరంగ ప్రదేశాల్లో పార్క్ చేసిన వాహనాలను లక్ష్యంగా చేసుకుంటాడు. నకిలీ తాళం చెవులను ఉపయోగించి లాక్ తీసి, వాహనాలను దొంగిలించడంలో ఇతను సిద్ధహస్తుడు. మాదాపూర్ పోలీసులు చందా నాయక్ తండా రోడ్డులో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా, దొంగిలించిన వాహనంపై అనుమానాస్పదంగా తిరుగుతున్న మురళిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. విచారణలో సరైన పత్రాలు చూపలేకపోవడమే కాకుండా, పోలీసుల నుండి తప్పించుకోవడానికి ప్రయత్నించి పట్టుబడ్డాడు అని పోలీస్ లు తెలిపారు. నిందితుడు ఇచ్చిన సమాచారం మేరకు, హైటెక్ సిటీ వీమీూ రైల్వే స్టేషన్ సమీపంలో దాచి ఉంచిన 7 బైకులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై మాదాపూర్ (2 కేసులు), సరూర్‌నగర్, ఖూనదీ, మధురా నగర్, భోంగీర్ రూరల్, చెర్లపల్లి మరియు సనత్‌నగర్. ఇంతేకాకుండా, ఇతనిపై 1999 నుండి బేగంపేట, అబిడ్స్, మార్కెట్, నిజామాబాద్, కామారెడ్డి, సైఫాబాద్, మియాపూర్, కూకట్‌పల్లి మరియు పటాన్‌చెరు వంటి వివిధ పోలీస్ స్టేషన్లలో అనేక దొంగతనాల కేసులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. క్లిష్టమైన ఈ కేసును ఛేదించి, నిందితుడిని పట్టుకున్న మాదాపూర్ క్రైమ్ టీమ్ సభ్యులను ఉన్నతాధికారులు అభినందించారు.

# వెంకటయ్య సేవలు అభినందనీయం -ఎంఈఓ జె ప్రసాదరావు

**సి ఎస్ పురం, సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 7**



మండల కేంద్రంలోని సి ఎస్ పురం విద్యా వనరుల కేంద్రంలో 25 ఏళ్లపాటు మెసెంజర్ గా విధులు నిర్వర్తించిన మేకల వెంకటయ్యను ఎంఈఓ జె. ప్రసాదరావు, కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. వెంకటయ్య క్రమశిక్షణ, సేవాభావానికి గుర్తింపుగా స్టాండ్ ఫ్యాన్ ను బహుకరించారు.సన్మాన కార్యక్రమంలో ఎంఈఓ ప్రసాదరావు, కార్యాలయ సిబ్బంది మాట్లాడుతూ వెంకటయ్య తన ఉద్యోగ జీవితమంతా క్రమశిక్షణ నిజాయితీ బాధ్యతాభావంతో సేవలందించారని కొనియాడారు ప్రతిరోజూ తొలి వ్యక్తిగా కార్యాలయం తలుపులు తెరిచేది ఆయనేనని, చివరికి తలుపులు మూసేది కూడా ఆయనేనని గుర్తుచేశారు. విద్యా వనరుల కేంద్రానికి వచ్చే ఉపాధ్యాయులు, అధికారులు, ప్రజలు పని నిమిత్తం కేంద్రానికి వచ్చినప్పుడల్లా చిరునవ్వుతో పలకరించి అందరి మన్ననలు పొందారని సహాయం కావాలంటే ముందడుగు వేయడం ఆయన సహజ లక్షణమని తెలిపారు. సంవత్సరాలు గడిచినా వెంకటయ్యలో మారని నిజాయితీ, పట్టుదల, సమయపాలన వీఆర్సి ప్రతిష్ఠను పెంచాయని ప్రశంసించారు. తన ఉద్యోగాన్ని కేవలం బాధ్యతగా కాకుండా సేవగా భావించిన వెంకటయ్య... చాలాసార్లు అదనపు పనులు చేసిన విసుగు చెందలేదని సిబ్బంది గుర్తు చేసుకున్నారు. వీఆర్సిలో పని నిమిత్తం గుర్తుకు వచ్చేది వెంకటయ్యని పలువురు ఉద్యోగులు అభిప్రాయపడ్డారు. ఎవరు చెప్పక ముందే తనంతట తానే ముందుకు వచ్చి పనులు పూర్తి చేయడం, బాధ్యతలను తప్పకుండా నిర్వర్తించడం వెంకటయ్య ప్రత్యేకతని పలువురు అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో ఎంఈఓ జె ప్రసాదరావు, ఎంఐఎస్ దీప్తి, ఆపరేటర్ ప్రవీణ్, సిఆర్ఎంటీ లు సతీష్, నారాయణ, శివరామయ్య, రమణయ్య, గౌసియా బేగం, ఐఇఆర్టి వెంకట్, పిటిఐ లు సీతారామయ్య, బాలచంద్ర మోహన్, ఐఇఆర్టి ఆయా నారాయణమ్మ పాల్గొన్నారు.

# కాకినాడ కలెక్టర్ ని మర్యాదపూర్వకంగా కలిసిన పిడి మధుసూదన్



**కాకినాడ సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 7**

కాకినాడ జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) నూతన పీడీగా బాధ్యతలు స్వీకరించిన ఎన్. మధుసూదన్ మంగళవారం కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ ను మర్యాదపూర్వకంగా కలిశారు.

# ప్రైవేట్ స్కూల్స్ లో రికార్డులు తనిఖీ చేసిన ఎమ్ ఇ ఒ డేవిడ్



**కాకినాడ జిల్లా, రూరల్ సిటిజెన్ టైమ్స్ ఏప్రియల్ 7**

కాజులూరు మండల ఎమ్ ఇ ఒ (1) డేవిడ్ గొల్లపాలెం లో వున్న ప్రవేట్ స్కూల్స్ లో ఆకస్మిక తనిఖీ నిర్వహించి రికార్డులు పరిశీలించి మేనేజ్ మెంట్స్ కు తగు సూచనలు చేసారు ఈ సందర్భంగా మండల విద్యా శాఖాదికారి డేవిడ్, స్థానిక శ్రీ నవోదయా స్కూల్ లో మీటింగ్ ఏర్పాటుచేసి ప్రవేట్ మేనేజ్ మెంట్స్ ప్రభుత్వ మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని విద్యార్థులకు సరైన విద్యను అందిస్తూ వారికి తగిన సౌకర్యాలను అందించాలని ఎప్పటికపుడు ప్రభుత్వ సూచనలను పాటిస్తూ ముందుకు సాగాలని సూచించారు ఈ కార్యక్రమంలో ,కాజులూరు మండల ప్రవేట్ స్కూల్స్ యూనియన్ జనరల్ సెక్రటరీ నవోదయ మూర్తి, మాట్లాడుతూ మా పరిధిలో వున్న స్కూల్స్ అన్ని ప్రభుత్వ నిబంధనలకు లోబడి పనిచేస్తున్నాయని, విద్యార్థులకు కావలసిన అన్ని సౌకర్యాలతో కూడిన విద్యనందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి స్థానిక ప్రవేట్ మేనేజ్మెంట్ ప్రతినిదులు అందరూ హాజరైనారు.


# పుదుచ్చేరి ఓటర్లకు సెలవు మంజూరు

### జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్



**అమలాపురం సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 7**

ఈ నెల 9, 23 తేదీల్లో పుదుచ్చేరి, తమిళనాడు శాసనసభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఆ ప్రాంత ఓటర్లు ఏదైనా వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక సంస్థల్లో పనిచేస్తుంటే ఆయా తేదీల్లో వేతనంతో కూడిన సెలవును మంజూరు చేయాలని కార్మిక శాఖ ఆదేశించినట్లు జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ ఒక ప్రకటనలో సూచించారు. ఎవరైనా నిబంధనలను ఉల్లంఘిస్తే జరిమానాతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ ఆదేశాలు ఓటర్లందరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ప్రోత్స హించడానికి ఉద్దేశింపబడినవన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు వేయడం అనేది ప్రాథమిక హక్కు మాత్రమే కాదని బాధ్యత అన్నారు. పుదుచ్చేరి, తమిళనాడు ఓటర్లుగా ఉండి, ప్రస్తుతం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పరిధిలోని ప్రైవేట్ లేదా ప్రభుత్వ రంగ సంస్థలలో పనిచేస్తున్న వారికి ఈ ఆదేశాలు వర్తిస్తాయన్నారు. సంబంధిత కార్మికులకు లేదా ఉద్యోగులకు ఆయా తేదీల్లో వేత నంతో కూడిన సెలవు తప్పనిసరిగా మంజూరు చేయాలని యాజమాన్యాలకు ఆయన సూచించారు .ఒకవేళ ఏ సంస్థ అయిన సెలవు నిరాకరిస్తే, అది నిబంధనల ఉల్లంఘనగా పరిగణించబడు తుందని,యాజ మాన్యాలపై జరిమానాలు, కఠినమైన చట్టప రమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మీరు ఒకవేళ ఆయా ప్రాంతాలకు చెందిన ఓటర్లు అయితే, మీ కార్యాలయం లో ఈ విషయాన్ని తెలియజేసి సెలవు పొందవచ్చునన్నారు.ఒకవేళ మీరు యాజమాని అయితే, మీ వద్ద పనిచేసే ఇతర రాష్ట్రాల ఓటర్లకు ఈ సౌకర్యం కల్పించాల్సిన బాధ్యత మీపై ఉంటుందని ఆయన ప్రకటనలో తెలిపారు.



నేహా శర్మ లుక్ మిస్ అవ్వడం చాలా బాగుంది

# నిర్మాతగా దూసుకుపోతున్న సుకుమార్!





శ్రేయా ధన్వంతరి కాన్ఫిడెంట్ న్యూ లుక్‌లో టోన్డ్ అబ్స్‌ని ప్రదర్శించింది

దర్శకుడిగా సుకుమార్ ఎలాంటి విజయాలు అందించారు? అన్నది చెప్పాల్సిన పనిలేదు. -ఆర్య- నుంచి -పుష్ప 2- వరకూ ఎన్నో వైవిధ్యమైన చిత్రాల్ని అందించారు. ప్రత్యేకించి -పుష్ప- విజయంతో స్టార్ డైరెక్టర్ గా ఇండియాలోనే ప్రత్యేకమైన గుర్తింపును దక్కించుకున్నారు. ప్రస్తుతం ఇండియాన్ టాప్ 5 డైరెక్టర్లలో ఆయన ఒకరు. ఇప్పుడా యనతో సినిమాలు చేయడానికి బాలీవుడ్ సహా స్టార్ హీరోలంతా క్యూలో ఉన్నారు. అలాగే తెలివైన శిష్యులను అందించడంలోనూ ఆయనే ముందున్నారు. ఇప్పటికే ఆయన స్కూల్ నుంచి కొంత మంది శిష్యులు డైరెక్టర్లగా రాణిస్తోన్న సంగతి తెలిసిందే. అలాగే నిర్మాతగానూ సుకుమార్ మరింత బిజీ అవుతున్నారు. ఈ విషయంలో ఏ స్టార్ డైరెక్టర్ లేనంత బిజీగా సుకుమార్ కనిపిస్తున్నారు. వరుసగా తన సొంత బ్యానర్ సుకుమార్ క్రియేటివ్ వర్క్స్ లో సినిమాలు నిర్మిస్తూ హైలైట్ అవుతున్నారు. -కుమారి 21 ఎఫ్- తో నిర్మాతగా తెరంగేట్రం చేసిన లెక్కలు మాస్టారు అనంతరం అదే సినిమా రీమేక్ కు సమర్పకుడిగా వ్యవహరించారు. -100 పర్సంట్ కాదల్- ను సమర్పించారు. అటుపై బుచ్చి బాబు దర్శకత్వం వహించిన -ఉప్పెన- కు నిర్మాతగా పని చేసారు. -విరూపాక్ష- చిత్ర నిర్మాణంలోనూ భాగమయ్యారు.-మంజుమ్మల్ బోయ్స్- లాంటి మలయాళ చిత్రాన్ని తెలుగు అనువాదంలో ఆయన హస్తం ఉంది. ప్రస్తుతం మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు తెరకెక్కిస్తోన్న -పెద్ది- సినిమాకు నిర్మాతగా కొనసాగుతున్నారు. మరో రెండు బ్యానర్లతో కలిసి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. అలాగే నాగ చైతన్య హీరోగా కార్తీక్ దండు తెరకెక్కిస్తోన్న -వృషకర్మ- సినిమా నిర్మాణంలో భాగమయ్యారు. అసలు విషయం ఏంటంటే ఈ సినిమాలన్నింటినీ తన శిష్యులు డైరెక్ట్ చేయడం ఇంట్రెస్టింగ్. ఆ కథల్లో సుకుమార్ హస్తం కూడా ఉంది. రచన విభాగంలో ఆయన ఇన్వాల్వ్ అవుతూ అవసరమైన ఇన్ పుట్స్ ఇస్తున్నారు.ఆ రకంగా తన బ్రాండ్ ను, పేరునే పెట్టుబడి పెడుతున్నారు. తాజాగా ప్రియదర్శి హీరోగా కూడా ఓ సినిమా నిర్మిస్తున్నారు. తెలంగాణ నేపథ్యంలో సాగే చిత్రమిది. బన్నీ వాసుతో కలిసి సుకుమార్ ఈ చిత్రాన్ని నిర్మించడం విశేషం. ఇవిగాక మరో రెండు..మూడు చిత్రాలకు సంబంధించి చర్చలు జరుగుతున్నాయి. ఓ స్టార్ డైరెక్టర్ నిర్మాతగా ఇంత బిజీగా ఉండటం అన్నది సుకుమార్ కే చెల్లింది. -పుష్ప 2- రిలీజ్ అయిన దగ్గర నుంచి సుకుమార్ నిర్మాణంలోనే బిజీగా ఉంటున్నారు. త్వరలోనే మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా కొత్త చిత్రం ప్రారంభించాలని సన్నాహాలు చేస్తున్నారు. -పెద్ది- రిలీజ్ అనంతరం చిత్రాన్ని పట్టాలెక్కించనున్నారు.

## బీసీసీఐ తప్పుడు నిర్ణయాలు.. ఏడాదికి రూ. 2400 కోట్ల నష్టం.. క్రికెట్ బోర్డుపై మోడీ ఫైర్





ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) నిర్వహణపై మరోసారి పెద్ద ఎత్తున చర్చ చెలరేగింది. బీసీసీఐ విధానాలపై ఐపీఎల్ వ్యవస్థాపకుడు లలిత్ మోడీ తీవ్రంగా మండిపడ్డారు. బీసీసీఐ తీసుకున్న నిర్ణయాలతో ఏడాదికి రూ.2400 కోట్ల వరకు ఈ లీగ్ కి నష్టం వాటిల్లుతోందని ఆయన చేసిన ఆరోపణలు సంచలనంగా మారాయి. ప్రస్తుతం లీగ్‌లో 10 టీమ్స్ ఉన్నప్పటికీ కేవలం 74 మ్యాచ్‌లతోనే టోర్నమెంట్ నిర్వహిస్తున్నారని తెలిపారు. అసలు ఈ ఫార్మాట్ ప్రకారం ప్రతి జట్టు ఒకే ప్రత్యర్థితో రెండేసి మ్యాచ్‌లు ఆడితే లీగ్ దశలోనే 90 మ్యాచ్‌లు, ప్లే ఆఫ్స్ కలిపి మొత్తం 94 మ్యాచ్‌లు జరగాల్సి ఉందని లలిత్ మోడీ పేర్కొన్నారు.

కొద్ది కాలంలోనే ప్రపంచవ్యాప్తంగా అత్యంత ఆదరణ పొందిన టీ20 లీగ్ గా ఐపీఎల్ చరిత్ర నెలకొల్పింది. ఇటీవలే ఈ టోర్నీ ప్రసార హక్కులు ఏకంగా రూ.48,390 కోట్లకు అమ్ముడుపోవడంతో పాటు ఈ సీజన్‌కు ముందు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, రాజస్థాన్ రాయల్స్ ఫ్రాంచైజీలు భారీ మొత్తానికి అమ్ముడైయ్యాయి. ఈ విషయంపై కూడా ఐపీఎల్ మాజీ చైర్మన్ లలిత్ మాట్లాడుతూ.. ఒక్కో మ్యాచ్‌కు మీడియా హక్కులతో భారీ ఆదాయం ఆర్జిస్తుంది.. హోంగ్రౌండ్ తో పాటు బయటి స్టేడియాల్లో కూడా మ్యాచ్‌లు జరిగే విధానం అమలు చేస్తే అదనంగా వేల కోట్లు బీసీసీఐ అకౌంట్లో చేరేవి.. ఆ ఆదాయంలో సగం ఐపీఎల్ ఫ్రాంచైజీలకు వెళ్తుంది. దాంతో టీమ్స్ వ్యాల్యూ కూడా మరింత పెరుగుతుందని లలిత్ మోడీ వెల్లడించారు.

ఇటీవల ఆర్సీబీ, రాజస్థాన్ జట్లు భారీ ధరకు అమ్ముడుపోవడం నాకు సంతోషంగా ఉంది.. కానీ టీమ్స్ కి హామీ ఇచ్చిన ఫార్మాట్‌ను అమలు చేయకపోవడం వాణిజ్య ఒప్పందానికి విరుద్ధమని లలిత్ మోడీ తెలిపారు. ఐపీఎల్ ప్రారంభమైన తొలినాళ్లలో 8 జట్లు మాత్రమే ఉండగా..

ప్రతి టీమ్ హౌంగ్రౌండ్ తో పాటు ఇరత స్టేడియాల్లో ఒకే ప్రత్యర్థితో రెండు మ్యాచ్‌లు తప్పనిసరిగా ఆడుతుండేవి.. కానీ ఇప్పుడు లీగ్‌లో 10 జట్లు ఉన్నాయి. తప్పకుండా 94 మ్యాచులు జరగాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం 74 మ్యాచులు మాత్రమే జరుగుతున్నాయి.. తగ్గిన 20 మ్యాచుల వలన ఒక్కో మ్యాచ్ కి వచ్చే రూ. 118 కోట్ల మీడియా రైట్స్ ఆదాయం పోతుంది.. ఫ్రాంచైజీలు కూడా రూ. 120 కోట్ల చొప్పు నష్టపోతున్నారని ఐపీఎల్ వ్యవస్థాపకుడు లలిత్ మోడీ చెప్పుకొచ్చారు.

## ఒక్క ఛాన్స్ అంటున్న సచిన్ టెండుల్కర్ కొడుకు.. వాటర్ బాయ్ డ్యూటీ ఇచ్చిన లక్నో..




గత ఐదేళ్ల పాటు ముంబై ఇండియన్స్‌లో కొనసాగిన అర్జున్ టెండుల్కర్ గత ఏడాది జరిగిన వేలంలో లక్నో సూపర్ జెయింట్స్ జట్టుకు ట్రేడ్ అయ్యారు. రిషబ్ పంత్ నాయకత్వంలోని లక్నో జట్టు ఇప్పటి వరకు రెండు మ్యాచ్‌లు ఆడినప్పటికీ, సచిన్ కొడుకుకు ఇంకా తుది జట్టులో అవకాశం మాత్రం దక్కలేదు. ఏప్రిల్ 5వ తేదీన సన్‌రైజర్స్ హైదరాబాద్ (గా=ఎ) తో జరిగిన మ్యాచ్‌లో అర్జున్ 'వాటర్ బాయ్'గా సేవలు అందిస్తుండగా తీసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. బౌండరీ లైన్ దగ్గర అభిమానులు తన పేరును పిలుస్తుంటే, అతడు హుందాగా తన బాధ్యతను నిర్వహించడం అందరినీ ఆకట్టుకుంది.


**అర్జున్ టెండూల్కర్ ఐపీఎల్ రికార్డులు:**

అర్జున్ టెండూల్కర్ ఇప్పటి వరకు ఐపీఎల్‌లో 5 మ్యాచ్‌లు ఆడాడు. ఈ మ్యాచ్‌లలో మొత్తం 3 వికెట్లు తీసుకున్నాడు. ఇవన్నీ ముంబై ఇండియన్స్ తరఫున ఆడినప్పుడే వచ్చాయి. 2023 సీజన్‌లో ఆయన ఐపీఎల్‌లో అరంగేట్రం చేశాడు. ప్రస్తుతం దేశవాళీ క్రికెట్‌లో అర్జున్ గోవా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

**వ్యక్తిగత జీవితం:**

గత నెలలో అర్జున్ టెండూల్కర్ సానియా చందోక్ను వివాహం చేసుకున్నారు. గ్రావిస్ గ్రూప్ ఛైర్మన్ రవి ఘై మనవరాలైన సానియా, టెండూల్కర్ కుటుంబానికి, ముఖ్యంగా అర్జున్ సోదరి సారాకు క్లోజ్ ఫ్రెండ్. ఈ వివాహ వేడుకకు భారత క్రికెట్ దిగ్గజాలు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కాగా, మైదానంలో అవకాశం కోసం ఎదురు చూస్తున్న అర్జున్, తన వ్యక్తిగత జీవితంలో మాత్రం సంతోషంగా ముందడుగు వేశారు. త్వరలోనే ఆయన లక్నో జెర్సీలో డెబ్యూ చేయాలని క్రికెట్ అభిమానులు కోరుకుంటున్నారు.

# గౌహతిలో భారీ వర్షం... రాజస్థాన్ రాయల్స్, ముంబై మ్యాచ్ ఆలస్యం




గౌహతి వేదికగా రాజస్థాన్ రాయల్స్, ముంబై ఇండియన్స్ మధ్య జరగాల్సిన ఐపీఎల్ మ్యాచ్‌కు వర్షం అడ్డంకిగా మారింది. మంగళవారం మధ్యాహ్నం నుంచి నగరంలో సుమారు మూడు గంటల పాటు భారీ వర్షం కురవడంతో, బర్సపరాలోని అస్సాం క్రికెట్ అసోసియేషన్ స్టేడియాన్ని సిబ్బంది కవర్లతో పూర్తిగా కప్పి ఉంచారు.

షెడ్యూల్ ప్రకారం రాత్రి 7:30 గంటలకు మ్యాచ్ ప్రారంభం కావాల్సి ఉండగా, వర్షం కారణంగా టాస్ కూడా వేయలేదు. వర్షం తగ్గుముఖం పట్టడంతో గ్రౌండ్ సిబ్బంది మైదానాన్ని సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు. సూపర్ సాపర్ల సహాయంతో ఔట్‌ఫీల్డ్‌లోని నీటిని తొలగిస్తున్నారు. త్వరలోనే అంపైర్లు మైదానాన్ని పరిశీలించి టాస్‌పై నిర్ణయం తీసుకోనున్నారు. రాత్రి 8:30 గంటల లోపు ఆట మొదలైతే ఓవర్ల కోత ఉండదని నిర్వాహకులు తెలిపారు.ఈ సీజన్‌లో గౌహతిలో రాజస్థాన్‌కు ఇది రెండో 'హోమ్' మ్యాచ్. ఇప్పటివరకు ఆడిన రెండు మ్యాచ్‌లలోనూ గెలిచి మంచి ఊపు మీదుంది. మరోవైపు, ముంబై ఇండియన్స్ ఒక మ్యాచ్ గెలిచి, మరొకటి ఓడిపోయింది. ఈ మ్యాచ్‌లో గెలిచి తిరిగి విజయాల బాట పట్టాలని చూస్తోంది.ఈ మ్యాచ్‌లో భారత స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా, రాజస్థాన్ యువ సంచలనం 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ మధ్య పోరుపై అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఐపీఎల్ లో ఇప్పటికే ఒక సెంచరీ, 30 సిక్సర్లు బాదిన ఈ బీహార్ కుర్రాడు.. బుమ్రా బౌలింగ్‌ను ఎలా ఎదుర్కొంటాడో చూడాలని అందరూ భావిస్తున్నారు. అయితే, ప్రస్తుతానికి వర్షం ఈ ఆసక్తికరమైన పోరుకు అడ్డుగా నిలిచింది.

Printed, published,and owned by kancherla Sandeep kumar. Published at Door. No. 19-57, Deendayalpuram, mudasarlova, Visakhapatanam, Andrapradesh 530040.
Printed at Sri Sai Ganga printer's and publications flat no. 504,Bharat towers, 5th lane, Dwarakanagar, Visakhapatanam,Andrapradesh 530016.
Editor. Kancherla Sandeep Kumar. RNI No. APTEL /2009/28868.PHONE No. 9966447776